₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 02

జనవరి 16-31, 2019





## లోక్‌సత్తా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కీలక సమావేశాలు



## ఏపీకి కేంద్ర హామీల అమలు తీరుపై స్వతంత్ర నిపుణుల బృందం నివేదిక విడుదల

## నిజమయిన ఫెడరల్ వ్యవస్థకి సరయిన అదను

| కొన్ని కీలక రంగాలలో 40 పెద్ద దేశాల మధ్య భారత్, ఇతర దేశాల స్థానాలు | భారత్ | చైనా | మలేషియా | వియత్నాం | దక్షిణాఫ్రికా | మెక్సికో |
|---|---|---|---|---|---|---|
| GDP Per capita (2017) PPP - Purchasing Power Parity | 45 | 36 | 28 | 46 | 39 | 34 |
| Life Expectancy (2017) | 46 | 30 | 36 | 31 | 50 | 28 |
| IMR - Infant Mortality Rate | 47 | 31 | 29 | 40 | 46 | 35 |
| MMR - Maternal Mortality Rate | 47 | 33 | 36 | 40 | 46 | 35 |
| Expenditure in Healthcare (2014) (% of Total Health Expenditure) | 46 | 32 | 13 | 37 | 3 | 38 |
| MYS (2017) (Mean years of Schooling) | 45 | 42 | 27 | 38 | 28 | 36 |
| HDI (Human Development Index) (2017) | 45 | 37 | 30 | 44 | 41 | 33 |
| Power Consumption (2017) (Kwh Per capita) | 44 | 33 | 29 | 43 | 28 | 39 |
| Percentage of population employed in Agriculture (2017) | 49 | 38 | 34 | 43 | 26 | 35 |
| LFPR (Labour Force Participation Rate) - Women (2017) | 45 | 4 | 27 | 1 | 37 | 40 |














కరీంనగర్ జిల్లా
చొప్పదండిలోని జడ్పీ ఉన్నత
పాఠశాలలో సదిశ ఫౌండేషన్
నిర్వహించిన కార్యక్రమంలో
లోక్‌సత్తా వ్యవస్థాపకుడు
డా॥ జయప్రకాష్ నారాయణ్

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జనవరి 16-31, 2019    సంపుటి - 10    సంచిక - 02




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

2024 నాటికి ప్రత్యామ్నాయ రాజకీయం......... 5

లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడిగా...................... 9

విభజన నేపథ్యంలో మిగిలిన ఏపీకి ఎంత........... 10

స్వతంత్ర నిపుణుల బృందం (ఐజిఇ) నివేదిక.........12

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర .........15

2014-15 సంవత్సరానికి వనరుల లోటు........17

వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధి సాయం........ 25

సీమ, ఉత్తరాంధ్రల్లో హైకోర్టు బెంచ్‌లను............ 30

నిజమయిన ఫెడరల్ వ్యవస్థకి సరయిన అదను...... 31

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# మీ అభిప్రాయాలు చెప్పండి..

ఆత్మీయ పాఠకులారా !

లోక్‌సత్తా భావజాలాన్ని ఇతరత్రా మార్గాలతో పాటు రకరకాల ప్రచురణల ద్వారా కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గత 22 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. ఏ అంశం మీదైనా, ఎంత సంక్లిష్టమైన, వివాదాస్పదమైన, భావోద్వేగపూరితమైన సమస్యమీదైనా లిఖితపూర్వకంగా తన వైఖరిని చెప్పే సాహసం, నిబద్ధతగల రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా! సమాజంలో, దేశంలో, ప్రపంచంలో మునుపెన్నడూ లేనంత శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నా కూడా.. లోక్‌సత్తా భావజాలం ఇప్పటికీ చెక్కుచెదరకుండా దిక్సూచిగానే కొనసాగుతోందని ఈ ప్రచురణల్లో భాగస్వాములైనవారిగా నిర్ద్వంద్వంగా చెప్పగలుగుతున్నాం. వీలైనన్ని ఎక్కువ ప్రచురణలతో నిరంతరాయంగా ఈ అజరామర భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాన్నదే మా (మీ) ఆకాంక్ష. మ్యాగజైన్ ప్రచురణల్లో భాగంగా పక్షపత్రికగా 'లోక్‌సత్తా టైమ్స్'ని, మాసపత్రికగా 'జనబలం'ని తీసుకొస్తున్నామని మీకందరికీ తెలుసు. ఇటీవలికాలంలో ప్రింట్ ధర, ఇతర ఖర్చులు పెరిగిపోవటంతో ఈ పత్రికల ప్రచురణ భారంగా మారింది. మన వనరులకు - పత్రికల వ్యయానికి పొంతన కుదరటం లేదు. ఇదేసమయంలో ఏదోకరూపంలో భావజాలాన్నయితే ప్రజల్లోకి తీసుకెళ్తూండాలి. ఈ నేపథ్యంలో.. ఏ వేదిక ద్వారా ప్రచురితమైనా లోక్‌సత్తా టైమ్స్, జనబలం రెండూ లోక్‌సత్తా భావజాల పత్రికలే కాబట్టి రెంటినీ విలీనం చేసి ఒకే పత్రికగా తీసుకురావాలనే ప్రతిపాదన వచ్చింది. "రెండిటిలో ఏది తేవాలీ, పక్షపత్రికగానా లేక మాసపత్రికగానా, ప్రింట్ ఎడిషన్‌గానా, ఆన్‌లైన్ పత్రికగానా?".. అనే చర్చ జరుగుతోంది. లోక్‌సత్తా కుటుంబ సభ్యులుగా ఈ అంశాలకు సంబంధించి మీ అభిప్రాయాలను కూడా తెలియచేయండి. మొత్తాన్నీ కూలంకషంగా సమీక్షించి నిర్ణయం తీసుకుందాం. అయితే ఆలస్యమయ్యేకొద్దీ భారం పెరుగుతుంది. మీ అభిప్రాయాల్ని, ఆదాయాన్ని పెంచుకునే మార్గాల సూచనల్ని దిగువ పేర్కొన్న ఐడీలకి సాధ్యమైనంత త్వరగా ఈ-మెయిల్ చేయవలసిందిగా మనవి.

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

- ఎడిటోరియల్ టీం

# 2024 నాటికి ప్రత్యామ్నాయ రాజకీయం + రాజకీయ ప్రత్యామ్నాయం

## మలిదశ ఉద్యమానికి లోక్‌సత్తా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కసరత్తు

**ప్రధాన స్రవంతి రాజకీయంగా చెలామణి అవుతున్న రాజకీయానికి ప్రత్యామ్నాయ రాజకీయాన్ని నిర్మించటంతోపాటు, అనుభవజ్ఞుల నేతృత్వంలో యువ నేతలను తయారుచేస్తూ రాజకీయ ప్రత్యామ్నాయాన్ని కూడా అందించేందుకు ఐదేళ్ల కాలవ్యవధి ప్రణాళికను రూపొందించుకోవాలని హైదరాబాద్, విజయవాడల్లో జరిగిన లోక్‌సత్తా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నేతల రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్ణయించాయి. ప్రణాళికను అతిత్వరలో ప్రకటించి వెంటనే కార్యాచరణను చేపడతామని, 2024 కల్లా ప్రత్యామ్నాయ రాజకీయం, రాజకీయ ప్రత్యామ్నాయాల్ని ఏకకాలంలో బలోపేతం చేయటం తమ లక్ష్యమని రెండు రాష్ట్రాల సమావేశాల్లో ముఖ్య అతిథిగా పాల్గని దిశానిర్దేశం చేసిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు.**

## తెలంగాణలో నిజమైన రాజకీయ నిర్మాణానికి కృషి జరగాల్సి ఉంది





తెలంగాణలో నిజమైన రాజకీయ నిర్మాణానికి కృషి జరగాల్సుందని, మైమరపించే తాయిలాలు కాకుండా.. అన్ని వర్గాల ప్రజలకూ తక్షణ, దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉండేలా లోక్‌సత్తా ప్రత్యామ్నాయ రాజకీయం ఉంటుందని జేపీ అన్నారు.

హైదరాబాద్‌లోని 'సెస్' (సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్) సమావేశ మందిరంలో లోక్‌సత్తా తెలంగాణ రాష్ట్ర సీనియర్, యువ నేతలతో జయప్రకాష్ నారాయణ్ సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా దేశంలో ప్రజాస్వామ్య సంస్కరణలకు అనుసరించాల్సిన వ్యూహం, పౌర సేవల చట్టం, బలమైన లోకాయుక్త సహా తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన పాలనా సంస్కరణలకు చేపట్టవలసిన కార్యక్రమాలు, వీటి కోసం సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయటంపై చర్చించారు.

అనంతరం మాట్లాడుతూ, ఉద్యమం ద్వారా సాధించుకున్న తెలంగాణలో రాజకీయ నిర్మాణం తీరు పట్ల సమావేశం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిందని జేపీ తెలిపారు. ఉద్యోగులకు జీతాలివ్వటం, ప్రజలకు తాయిలాలు, స్కీములు పందేరం చేయటం తప్ప ప్రజలు తలెత్తుకుని స్వతంత్రంగా బతికేలా, వారి పిల్లలకు మంచి భవిష్యత్తు లభించేలా మౌలిక విధానాల్ని అమలు చేయని రాజకీయమే తెలంగాణలోనూ నడుస్తోందన్నారు.

దాదాపు రెండున్నర దశాబ్దాల పోరాటంలో లోక్‌సత్తా నూతన ప్రజాస్వామిక ఆలోచనల్ని, కొత్త రాజకీయ సంస్కృతిని అందించటంతోపాటు ఎంతో కీలకమైన 91, 97, 99 రాజ్యాంగ సవరణల్ని, ఏడెనిమిది ప్రధాన చట్టాలను సాధించిందని, పలు రకాలైన విధానపరమైన

మార్పులకు నాంది పలికిందని, ప్రస్తుత నేపథ్యంలో మలిదశ ఉద్యమానికి సన్నద్ధ మవుతోందని జేపీ ప్రకటించారు.

"లోక్‌సత్తా ఏనాడూ మాట తప్పలేదు. సమాచారంలో, అంకెల్లో మార్పును బట్టి మా విధానాలు అప్‌డేట్ అవు తుంటాయి తప్ప, మౌలికంగా మా మాటల్లో, విధానాల్లో ఎటువంటి మార్పూ లేదు. ప్రజల్ని స్వతంత్ర జీవనమున్న వారిగా కాకుండా యాచకుల్లా, ఓటు వేసే యంత్రాల్లా చూస్తున్న ప్రస్తుత రాజకీయాన్ని మేం ఆమోదించటం లేదు. ఈ పార్టీ, ఆ పార్టీ, రాష్ట్రం, దేశం అని తేడా లేకుండా అన్ని పార్టీలూ, అన్ని స్థాయిల్లో అదే తరహా రాజకీయం చేస్తున్నాయి. ఆ రాజకీయాన్ని మేం తిరస్కరిస్తున్నాం. ప్రత్యామ్నాయ రాజకీయాన్ని, రాజకీయ ప్రత్యామ్నాయాన్ని అందించేందుకు నిర్దిష్ట ఎజెండాతో, కొత్త పద్ధతుల్లో మరోదశ పోరాటాన్ని చేపడుతున్నాం'' అని ప్రకటించారు. ఇందుకోసం పకడ్బందీ సంస్థాగత నిర్మాణం, వ్యూహ కార్యాచరణతో పునరంకితం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

తెలంగాణలో రానున్న ఐదేళ్ల కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని జేపీ తెలిపారు. తక్షణ ప్రయోజనాలను, భావితరాల అవసరాలనూ అనుసంధానం చేస్తూ దీర్ఘకాలిక పోరాటంగా ఈ కార్యాచరణ ఉంటుందన్నారు.

# ప్రాంతీయ పార్టీల రాజకీయం ఫెడరలిజాన్ని బలోపేతం చేయాలి



మన గురించి మనం డబ్బా కొట్టుకోవటమే తప్ప, భారతదేశం అగ్రస్థాయికి చేరుకోగలదని ప్రపంచంలో ఎవరూ అనుకోవటం లేదని జేపీ అన్నారు. మౌలికమైన విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో సరైన విధానాల్ని అమలు చేయటం, వికేంద్రీకరణతో స్థానిక స్వయంపాలనను అందించటం వంటి చర్యల వల్ల చైనాను అగ్రదేశానికి పోటీ పడుతున్న దేశంగా ప్రపంచం గుర్తించిందని.. కానీ అలాంటి మౌలిక ఎజెండాను మనం పట్టించుకోకపోవటం వల్ల పడుతూ లేస్తున్న సాదాసీదా దేశంగానే ప్రపంచం మన గురించి భావిస్తోందన్నారు. 1978 నాటికి మనకంటే వెనుకబడి ఉన్న చైనా, చాలా ఏళ్ల పాటు మనకంటే అధ్వాన్నంగా ఉన్న మలేషియా, కొరియా, చివరికి దక్షిణాఫ్రికా కూడా సరైన ఎజెండాను అమలు చేసుకోవటం వల్ల మనకంటే ముందంజలో ఉన్నాయన్నారు.

సుస్థిరాభివృద్ధికి కావలసిన పునాది రంగాల్లో ఇలా మనం అధ్వాన్నంగా, 49 దేశాల్లో చివరి ఐదు స్థానాల్లో, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియా వంటి దేశాల సరసన ఉంటే.. మన చర్చంతా చంద్రబాబు నాయుడు వర్సెస్ కేసీఆర్, మోదీ వర్సెస్ రాహుల్, ఆ పార్టీ వర్సెస్ ఈ పార్టీ వంటి అంశాలకే పరిమితమై పోయిందని జేపీ అన్నారు. తాను ఇటీవలి కాలంలో దాదాపు మూడొందల మంది దాకా హైకోర్టు న్యాయమూర్తులతో సమావేశమయ్యానని, మీరెవరో చెప్పకుండా, ఎవరితోనో సిఫారసు చేయించుకోకుండా, లంచం ఇవ్వకుండా, జాప్యం లేకుండా సొంత ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయంలో పనిచేయించుకోగలరా?.. అన్న ప్రశ్నకు ఒక్కరు కూడా ఔనని సమాధానమివ్వ లేకపోయారని, ప్రజల రోజువారీ జీవితాలు ఇంత అధ్వాన్నంగా ఉంటే మనం ఆ అంశాల గురించే చర్చించటం లేదన్నారు. ఈ అంశాలకు – ఓటుకు ఉన్న సంబంధాన్ని తెలియజెప్పటం లేదన్నారు. పౌర సేవల చట్టం కోసం ఉద్యమానికి సమయం ఆసన్నమైందని తాను హీరోగా భావించే శరద్‌జోషి పాతికేళ్ల క్రితం చెప్పారని, ఇప్పటికి కూడా ఈ ఉద్యమం ఇంకా ఎన్నికల అంశంగా మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నేతల సమావేశం పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సారథ్యంలో జేపీ ముఖ్య అతిథిగా విజయవాడలో జరిగింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్ర



(యూనియన్) ప్రభుత్వ హామీలు, సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా దేశంలో ప్రజాస్వామ్య సంస్కరణలకు అనుసరించాల్సిన వ్యూహం, ఆంధ్రప్రదేశ్‌లో పాలనా సంస్కరణలకోసం చేపట్టవలసిన కార్యక్రమాలు, వీటి కోసం సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయటంపై సమావేశంలో రెండు రోజుల పాటు చర్చించారు. లోక్‌సత్తా తెలంగాణకు చెందిన ముఖ్య నేతలు కూడా హాజరయ్యారు.

తొలిరోజు సమావేశం అనంతరం మాట్లాడుతూ, అధికారం లక్ష్యం మంచి పాలనను అందించట మని, మంచి పాలన అంటే చట్టబద్ధపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు గౌరవ ప్రదమైన సేవలు, ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, స్థానిక స్వయం పాలన, ఉపాధి అవకాశాలను అందించటమని, కానీ అధికారమంటే కేవలం ప్రజల సొమ్మును పందేరం చేస్తూ సొంత సొమ్మన్నట్లు డబ్బా కొట్టుకునే పెత్తందారీ ధోరణులు పెచ్చరిల్లాయని జేపీ అన్నారు. ఉద్యోగంలోకి ఎంతో ఆదర్శభావాలతో, ప్రతిభతో ప్రవేశించినవారు కూడా ఈ వ్యవస్థలో పెత్తందార్లలా తయారై తమకు జీతాలిచ్చే ప్రజల నెత్తినెక్కి కూర్చుంటు న్నారన్నారు. దీన్ని మార్చాల్సిందిపోయి.. రాజకీయ పార్టీలు నియోజకవర్గానికి రెండొందల మంది కార్యకర్తల వ్యవస్థను ఏర్పాటు చేసి పైరవీలు చేస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించే పని చేస్తున్నాయని, ప్రతిఫలంగా ప్రజల సొమ్మును అనేకరెట్లు దోచేస్తున్నాయని అన్నారు. ప్రజలు.. పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలవారీగా విభజితులై బలహీన పడ్డారని, అందువల్ల ప్రభుత్వాలకు ప్రజలంటే భయం లేదని, ప్రలోభపెట్టో, రెచ్చగొట్టో వారిని నచ్చినట్లు ఆడించగలమనే అభిప్రాయం ఏర్పడిపోయిందన్నారు. ఉద్యోగులు మాత్రం సంఘటితంగా ఉన్నారని, అందువల్ల ఉద్యోగులను చూసి ప్రభుత్వాలకు వణుకు పుడుతోందని అన్నారు. ఏదోకరూపంలో పౌర సేవల చట్టంలేని పెద్ద రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉన్నాయన్నారు. ఏపీలో పారిశ్రామిక వేత్తల కోసం ఇలాంటి చట్టం తెచ్చారు తప్ప సామాన్య పౌరులకు నిర్ణీత గడువులోగా ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలందించే చట్టం అమలు చేయటం లేదన్నారు.

ప్రజాస్వామ్యం పేరుతో ఇప్పుడు నడుస్తున్న అవ్యవస్థ, దుర్రాజకీయం మారేవి కావన్న నిర్వేదం అందరిలో ఆవరించి ఉందని, కానీ ఎప్పటికైనా మార్చటం తప్ప మరో మార్గం లేదని, లోక్‌సత్తా మలిదశ ఉద్యమం ద్వారా రాష్ట్రంలో, జాతీయ స్థాయిలోనూ ఇందుకు పునరంకితమవుతోందని జేపీ అన్నారు.

ప్రజల ఆకాంక్షలు, వారి ఓటు.. రాష్ట్ర స్థాయి పార్టీలు, నాయకత్వాల చుట్టూ తిరుగుతుంటే, ఎక్కువ అధికారాలు మాత్రం మనదేశంలో జాతీయస్థాయి ప్రభుత్వం వద్ద కేంద్రీకృతమై ఉన్నాయని జేపీ అన్నారు. బిజూ పట్నాయక్, ఎన్.టి రామారావు, కరుణానిధి, హెగ్డే, వంటి వారి పోరాటం, బొమ్మయ్ కేసులో తీర్పు, ప్రాంతీయ పార్టీలు పెరగటం వల్ల రాష్ట్రాలు బలపడ్డాయని, అంతవరకూ ఎంత బలమైన రాష్ట్ర ప్రభుత్వమైనా

కేంద్రం తలచుకుంటే తెల్లారేసరికి బర్తరఫ్ అయిపోతుండేదని అన్నారు. అయితే ఇంకా ఉమ్మడి జాబితా పేరుతో విద్య, ఆరోగ్యం, భూసేకరణ వంటి కీలకాంశాల్లో అధికారాలు కేంద్రం వద్దే ఉన్నాయన్నారు. వీటన్నిటినీ వికేంద్రీకరించటంతోపాటు, స్థానిక ప్రభుత్వాలనూ బలోపేతం చేయాల్సి ఉందన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ విలువైన అవకాశాన్ని జారవిడుచుకున్నారని, ఇప్పుడు సహకార ఫెడరలిజాన్ని పునర్నిర్వచించి ఈ రకమైన మూడో అంచె ఫెడరలిజాన్ని సాధించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. పార్టీల్ని సొంత ఆస్తుల్లా తయారుకోవటం, అవినీతి సొమ్మును పోగేసుకోవటం, తాయిలాల్ని పందేరం చేయటం, సాంకేతికత, అరకొర మౌలిక వసతులు వంటి అంశాలే ప్రస్తుతం రాష్ట్రాల్లో రాజకీయంగా మారిందని.. రాష్ట్ర స్థాయిలో హక్కుగా ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవలు, చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక స్వయంపాలనకు నిధులు, అధికారాలు, వ్యవసాయంలో లాభాల కోసం పోరాటం చేయటంతోపాటు, వాటితోపాటు మిగిలిన అంశాల్లోనూ రాష్ట్రాల్లో పాలన మరింత సమర్థంగా ఉండేందుకుగాను కేంద్రం నుంచి అధికారాలను వికేంద్రీకరించి ఫెడరలిజాన్ని స్థానిక ప్రభుత్వాల వరకూ బలోపేతం చేసేందుకు జాతీయస్థాయిలోనూ పోరాడాల్సి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో జాతీయ పార్టీల గుత్తాధిపత్యం సాగదని, కేంద్రంలో ప్రాంతీయ పార్టీల ప్రభావం గణనీయంగా ఉంటుందని అన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా చంద్రబాబు, కేసీఆర్ చేస్తున్న పోరాటం వెనుక పార్టీ రాజకీయ కారణాలున్నాయని, ఏపీలో కాంగ్రెస్ బలహీనపడింది కాబట్టే చంద్రబాబు జతకట్టారని అన్నారు. అయితే, వారి రాజకీయంతో సంబంధం లేకుండా వారి డిమాండ్ల వెనుక లోతైన అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. దేశ ఐక్యత, సమగ్రత పరిధిలో ఫెడరలిజాన్ని బలోపేతం చేయటం కోసం చర్యలకు కేసీఆర్, చంద్రబాబు వంటి నేతల పోరాటాలు దారితీయాలన్నారు. కేవలం ప్రాంతీయ పార్టీల నేతలే కాకుండా, జాతీయ పార్టీల ప్రాంతీయ నేతలు కూడా రాష్ట్రాలకు మరిన్ని అధికారాలను కోరుకుంటున్నారన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని నెరవేర్చటంపై స్వతంత్ర నిపుణులతో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్)/లోక్‌సత్తా ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన నివేదికను ప్రస్తావిస్తూ.. ఇది విభజనకు సంబంధించిన ప్రత్యేక సమస్యని, దీన్ని వివిధ రాష్ట్రాలు కేంద్రం నుంచి మరిన్ని నిధుల్ని కోరుతూ చేస్తున్న డిమాండ్లను ఒకే గాటన కట్టకూడదని జేపీ స్పష్టం చేశారు. అయితే ఇవి రెండూ సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలకు, స్థానిక ప్రభుత్వాల సాధికారతకు దోహదం చేయాలన్నారు.

ఈ అంశాలన్నిటినీ లోక్‌సత్తా సమావేశంలో చర్చించామని, కార్యాచరణకు పెద్దదిక్కులాంటి నేతలైన డి.వి.వి.ఎస్ వర్మ, డా॥ పట్టాభి రామారావులతో రెండు కమిటీల్ని వేశామన్నారు. ఈ కమిటీల నిర్ణయాలకనుగుణంగా కార్యాచరణను వేగంగా ఖరారు చేసి వెంటనే అమలు ప్రారంభిస్తామన్నారు.

2019 ఎన్నికల్లో పోటీపై జవాబినస్తూ, ఒక్కో నియోజకవర్గానికీ ఎన్ని కోట్లు ఖర్చు పెడుతున్నారో తెలుసు గదా, లోక్‌సత్తా అలా ఖర్చు చేయగలదా? అని జేపీ ప్రశ్నించారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోయినా, సరైన మార్పు కోసం లోక్‌సత్తా పోరాటం కొనసాగుతుందన్నారు. ఎన్నికల్లో పోటీ వల్ల ప్రజలకు ప్రయోజనం ఉంటుందనుకుంటే లోక్‌సత్తా పోటీ చేస్తుందని, ఆ అంశాన్ని కూడా కమిటీలు నిర్ణయిస్తాయని తెలిపారు.

జనసేనతో కలిసి పోటీ అంశంపై జవాబిస్తూ.. "ఆలూలేదు చూలూ లేదు, మేం పోటీ చేయాలో లేదో కూడా ఇంకా నిర్ణయించుకోలేదు, మేం నిర్ణయించుకున్నాక ఆ విషయంపై మాట్లాడతాం. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాకు బాగా తెలిసిన వ్యక్తి. కేవలం మంచి సంకల్పం కాకుండా, స్పష్టమైన ఎజెండా, విధానాలు కావాలి" అని జేపీ వ్యాఖ్యానించారు.

పార్టీలు సొంత ఆస్తులుగా తయారయ్యాయని, భారతదేశంలో బహుశా ఇప్పటిదాకా సభ్యులు అధ్యక్షుడిని ఎన్నుకున్న పార్టీ లోక్‌సత్తా మాత్రమేనని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ చెప్పారు. బరాక్ ఒబామా ఎవరో పదిహేనేళ్ల క్రితం ఎవరికీ తెలియదని, డొనాల్డ్ ట్రంప్ ఎవరో రెండేళ్ల క్రితం వరకూ ప్రపంచానికి తెలియదని, కానీ ఒక పార్టీలో చేరి తమ సామర్థ్యంతో వేగంగా ఎదగగలిగారని, మన పార్టీల నిర్మాణంలోని పెత్తందారీ స్వభావం వల్ల అలాంటి పరిస్థితి మనదేశంలో లేదని అన్నారు. లోక్‌సత్తా భావజాలానికి తాను ఆద్యుడిని కాబట్టి, లోక్‌సత్తా అంటే జయప్రకాష్ అనే భావన చాలామంది మనసుల్లో ఉందని, కానీ జయప్రకాష్ మనసులో మాత్రం అలాంటి భావం లేదని అన్నారు. లోక్‌సత్తా ప్రజల ఆస్తి అని పునరుద్ఘాటించారు. లోక్‌సత్తా పనిచేస్తున్న మార్పులు వస్తే.. ప్రజలకు తమ ఓటు విలువ అర్థమవుతుందని, ఓటుకు – తమ జీవితాలకు మధ్య సంబంధమేంటో తెలిసి సరైనవారిని ఎన్నుకుంటారన్నారు. ■

# లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడిగా డి.వి.వి.ఎస్ వర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు బాబ్జీ, వజీర్, ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి..పలు కీలక నిర్ణయాలు తీసుకున్న విజయవాడ సమావేశం





వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిశానిర్దేశంలో విజయవాడలో జనవరి 6 నుంచి రెండు రోజులపాటు జరిగిన లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకోవటంతోపాటు, రానున్న ఎన్నికలను మార్పునకు ఒక అవకాశంగా వినియోగించుకునే చారిత్రక రాజకీయ పాత్ర పోషించే లక్ష్యంతో పలు కీలక నిర్ణయాల్ని తీసుకుంది. వివరాలను లోక్‌సత్తా వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.

లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా డి.వి.వి.ఎస్ వర్మను, వర్కింగ్ ప్రెసిండెంట్‌లుగా భీశెట్టి బాబ్జీ, సీహెచ్ వజీర్, ప్రధాన కార్యదర్శిగా అల్లు శివ రమేష్ రెడ్డిలను పార్టీ సమావేశం ప్రకటించింది.

**ఉపాధ్యక్షులుగా..** వై.డి రామారావు, ఎన్. శ్రీధర్, ఎస్. వెంకటేశ్వర్లు, పి. రాంబాబు, ఓంకార్,

**కార్యదర్శులుగా..** జె. ఐరామ్మూర్తి, ఎస్. జానకిరామరాజు, కె. బాలసుబ్రహ్మణ్యం,

**నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా..** రాజ్యలక్ష్మి, టి. లక్ష్మి, శివాజీ రాజు, రత్నకుమారి, ఎం. భానుప్రసాద్, జేవీ రమణ, ఎంఎస్ఎన్ మూర్తి, ఎ. గాంధీ, చంద్రశేఖర్, ఆనందాచారి, రామారావు,

**ప్రత్యేక ఆహ్వానితులుగా..** కటారి శ్రీనివాసరావు, పి. రవిమారుత్,

**క్రమశిక్షణా సంఘంగా..** డా॥ పట్టాభి రామయ్య, జి. జానకిరామరాజు, డా॥ రాధాదేవిలను సమావేశం ప్రకటించింది.

**జనవరి 20న తొలి సమావేశం, రాజకీయ ఎజెండా ప్రకటన**

జనవరిలోనే తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయటం సహా పార్టీ ప్రకటించిన కార్యాచరణ వివరాలు:

- జనవరి 20న పార్టీ నూతన రాష్ట్ర కార్యవర్గ తొలి సమావేశం నిర్వహించటం, ఒక రాజకీయ ఎజెండాను ప్రకటించటం
- ఫిబ్రవరి 20లోపు ఎంపిక చేసిన 25 నియోజకవర్గాలలో రౌండ్‌టేబుల్ సమావేశాలు
- మార్చి మొదటివారంలో రాష్ట్ర సదస్సు నిర్వహణ
- మార్చి 25 లోపు 3 ప్రాంతీయ సదస్సులను విశాఖపట్నం, విజయవాడ, అనంతపురం/ తిరుపతిల్లో నిర్వహించటం
- ఏప్రిల్ నాటికి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థుల్ని గుర్తించటం, లోక్‌సత్తా పార్టీ ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా నిర్ణయించటం

■


# విభజన నేపథ్యంలో..
# మిగిలిన ఏపీకి ఎంత ఇవ్వాల్సుంది, వివాదం, భారం లేకుండా కేంద్రం ఎలా ఇవ్వొచ్చు..

**సమగ్రంగా వెల్లడించిన 'స్వతంత్ర నిపుణుల బృందం' నివేదిక విడుదల!**

## ఈ కృషి ఫెడరలిజాన్ని బలోపేతం చేయాలన్న జేపీ

"నిజాలు పవిత్రం, వ్యాఖ్య ఇష్టానుసారం - నిజాలు ఆధారంగా చేసే వ్యాఖ్య అన్నిటికన్నా పవిత్రం"

– సి.పి స్కాట్




రాష్ట్ర విభజన నేపథ్యంలో మిగిలిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన చట్టం ద్వారా, అప్పటి ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ రాజ్యసభలో చేసిన ప్రకటన ద్వారా ఇచ్చిన హామీల్లో చాలావరకూ ఇప్పటికీ అమలు కాలేదని ఎఫ్.డి.ఆర్/లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కన్వీనర్‌గా ఏర్పడిన స్వతంత్ర నిపుణుల బృందం తేల్చి చెప్పింది. రాష్ట్ర విభజన జరిగిన సంవత్సరం 2014-15లో రెవెన్యూలోటును భర్తీ చేయటం దగ్గర్నుంచీ చాలా కీలకమైన అంశాల్ని సకాలంలో తేల్చకపోవటం, వాటిపై స్పష్టత లేకపోవటంతో పీటముడిలా తయారైందని, ఈ పరిస్థితి రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తు మీద ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని స్పష్టం చేసింది. రుణమాఫీ వంటి కొత్త, అప్రామాణిక పథకాల వ్యయాన్ని కేంద్రం తిరస్కరించినా.. ప్రమాణీకరించిన, నిబంధనల ప్రకారమే ఉన్న వ్యయాల్ని కూడా భర్తీ చేయకపోవటం వల్ల సమస్య జటిలమైందని అభిప్రాయ పడింది.

నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర (యూనియన్) ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో... వాస్తవాల అధ్యయనానికి, పరిష్కారాలను అందించేందుకు, ఆ పరిష్కారాల సాధన కోసం పౌర సమాజంగా మధ్యవర్తిత్వం చేసేందుకూ ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ - ఎఫ్.డి.ఆర్) చొరవ తీసుకుని పార్టీలకతీతంగా ఏర్పాటు చేసిన 'స్వతంత్ర నిపుణుల బృందం' (ఇండిపెండెంట్ గ్రూప్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ - ఐజిఇ) సవివరమైన అధ్యయనం తరువాత తన నివేదికను విజయవాడలో విడుదల చేసింది. పదిహేనుగురు నిష్ణాతులు నిష్పాక్షికంగా అధ్యయనం చేసి నివేదికని రూపొందించారు. ఆ నివేదికని తెలుగు రాష్ట్రాలతో సంబంధంలేని నలుగురు జాతీయ నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదముద్ర వేశారు. 144 పేజీల ఈ సమగ్ర నివేదికని విజయవాడ బెంజి సర్కిల్ వద్దనున్న 'వేదిక' హాల్‌లో ఐజిఇ సభ్యులు జస్టిస్ పర్వతరావు (ఎ.పి హైకోర్టు మాజీ న్యాయమూర్తి), కె. పద్మనాభయ్య (భారత ప్రభుత్వ హోం శాఖ మాజీ కార్యదర్శి), ప్రొఫెసర్ ఆర్. రాధాకృష్ణ (సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ - సెస్ ఛైర్మన్), అజేయ్ కల్లాం (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి), ప్రొఫెసర్ ఎస్.గలాబ్ (సెస్ డైరెక్టర్), డా॥ జయప్రకాష్ నారాయణ్ (ఐజిఇ కన్వీనర్,




ఎఫ్‌డిఆర్ ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు) విడుదల చేశారు.

2014-15 రెవెన్యూ లోటు భర్తీ దగ్గర్నుంచీ, పోలవరం, పన్ను రాయితీల వరకూ కీలకమైన, వివాదాస్పదమైన 10 అంశాలను కమిటీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, సమాఖ్య వ్యవస్థ పరిధిలో ఆచరణాత్మక పరిష్కారాలను చూపింది. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీలో భాగంగా ఏపీలోని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సింది ఏడాదికి రూ.50 కోట్లు కాదని, మొత్తంగా సుమారు రూ.24,350 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందని సాధికారికంగా వివరించింది. అత్యంత వివాదాస్పదమైన ప్రత్యేక హోదా పన్ను రాయితీలకు.. పొరుగు రాష్ట్రాలతో ఇబ్బంది లేకుండా, ఆంధ్రప్రదేశ్‌కు నష్టం లేకుండా ఆచరణాత్మకంగా మూడు పరిష్కారాలను సూచించింది. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్రం నిధుల వాటా 90 శాతానికి బదులు కేంద్రం అందిస్తానన్న రూ.16, 447 కోట్ల సాయానికి విదేశీ తోడ్పాటు ప్రాజెక్టులు (ఇఎపి) పద్ధతి సరికాదని, దీని ద్వారా ఐదేళ్లలో మహాఅయితే కేవలం రూ.5,000 కోట్లు మాత్రమే ఏపీకి అందుతాయని స్పష్టం చేసింది. ప్రత్యేక సాయానికి 'సెస్' నిపుణుల అధ్యయనం ద్వారా తేల్చిన (క్వాంటిఫై చేసిన) మొత్తం, కేంద్రం ఒప్పుకున్న మొత్తం దాదాపు సమానంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసింది. అయితే ఇఎపి పద్ధతిలో కాకుండా.. కేంద్రానికి రాష్ట్ర బకాయిలను చెల్లబెట్టుకునే పద్ధతిలో నిధులనిస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక సాయం ద్వారా న్యాయం జరుగుతుందని తెలిపింది. నాబార్డ్, హడ్కో రుణాలతో పాటు ఆంధ్రప్రదేశ్ సహాయ బాండ్లను కూడా విడుదల చేస్తే.. కేంద్రం ఆర్థిక భారం లేకుండానే ఏపీకి ఇచ్చిన ఆర్థిక హామీల్ని నెరవేర్చ వచ్చునని తెలిపింది. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అసంబద్ధత వల్ల ఆంధ్రప్రదేశ్‌కు పన్నుల పరంగా రూ.3,820 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇది పార్లమెంటు చట్టం ద్వారా జరిగిన తప్పిదం కాబట్టి.. కేంద్రమే భర్తీ చేయాలని స్పష్టం చేసింది. విభజన వల్ల తలసరి ఆదాయంలో దేశంలోనే వెనుకబడిన పెద్ద రాష్ట్రంగా ఏపీ ఉందని, ఏపీలోని రాయలసీమ, ఉత్తరాంధ్రలు రాష్ట్ర తలసరి కంటే వెనుకబడి ఉన్నాయని, అందువల్ల కేంద్రం తన విచక్షణ పరిధిలో కూడా ఉదారంగా వ్యవహరించి వెనుకబడిన జిల్లాల్లో పెట్టుబడులు పెరిగేలా ఏపీకి ఆర్థికంగా తగురీతిలో అండదండలందించాలని సిఫార్సు చేసింది.

నివేదిక విడుదల సందర్భంగా జేపీ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రయోజనాలంటే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుల ప్రైవేటు వ్యవహారం కాదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులపై రకరకాల వాదనలు ప్రచారంలో ఉన్నాయని, పార్టీలకు అతీతంగా వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పాలన్న ఉద్దేశంతో.. చిత్తశుద్ధితో ఈ నివేదికను రూపొందించామని తెలిపారు. సమావేశంలో పాల్గన్న ఇతర నిపుణులతో కలిసి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నివేదికను అంశాలవారీగా వివరించారు.

ఈ నివేదిక ఆంధ్రప్రదేశ్‌కు విభజన సమయంలో ఇచ్చిన హామీలకు సంబంధించినదే అయినా, ఇందులో మన సమాఖ్య వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలున్నాయని జేపీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించినట్లు అసెంబ్లీ ఆమోదం, ప్రజలను ఒప్పించటం లేకుండా ఆర్టికల్ 3తో ఏకపక్షంగా కేంద్రం రాష్ట్రాల విభజన చేస్తే దీర్ఘకాలంలో అది దేశ ఐక్యతను బలహీనపరుస్తుందని స్పష్టం చేశారు. ఒక రాష్ట్ర విభజన ఎలా చేయాలి, నిధుల విడుదల, పాలన పరంగా రాష్ట్రాలపై కేంద్ర (యూనియన్) ప్రభుత్వ నియంత్రణ ఏ మేరకు ఉండాలి, పాలన ప్రజల చుట్టూ తిరిగేలా కేంద్ర-రాష్ట్ర సంబంధాలను స్థానిక ప్రభుత్వాల వరకూ వికేంద్రీకరించి ఫెడరల్ వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలి తదితర అంశాలకు ఈ నివేదిక ఒక నేపథ్యంగా, వనరుగా ఉపయోగపడుతుందన్నారు. ■

# స్వతంత్ర నిపుణుల బృందం (ఐఎఫ్ఇ) నివేదిక సిఫార్సుల సారాంశం



**(1) 2014-15 సంవత్సరానికి వనరుల లోటు**

2014-15 సంవత్సరానికి నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న వనరుల లోటు రూ.19,015.48 కోట్లు. ఇందులో ఇప్పటికే చేసిన ఖర్చులు, చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఆదాయ వనరుల సమస్య, నిధుల కొరత వల్ల విభేదించిన వ్యయం కలిపి ఉన్నాయి.

ఈ మొత్తం లోటులో రూ.10,335.07 కోట్లు స్పష్టంగా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేసిన వ్యయం. మార్చి 31, 2015 నాటికి పెండింగ్‌లో ఉన్న బిల్లులు, చేసిన చెల్లింపుల్ని కేంద్రం తనిఖీ చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం (ఎపిఆర్ఎ), 2014 నిబంధనలు, స్ఫూర్తి, పార్లమెంటులో ప్రధానమంత్రి ఇచ్చిన నిబద్ధ హామీకి అనుగుణంగా ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా భర్తీ చేయాలి.

మిగిలిన రూ.8,660.41 కోట్లు కచ్చితంగా వనరుల లోటు అని తీర్మానించలేం. కొత్త పథకాలు, ప్రమాణీకరించని వ్యయం కింద పరిగణించి, భారత ప్రభుత్వం తన విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చు.

**(2) చట్టంలోని అసంబద్ధతల వల్ల కలిగిన నష్టం**

చట్టంలోని అసంబద్ధత వల్ల ఆంధ్రప్రదేశ్‌కనికర ఆదాయంలో రూ.3,820.36 కోట్ల (నికర ఆదాయం) నష్టం వచ్చింది. ఇది పార్లమెంటు ఆమోదించిన చట్టంలోని నిబంధనల్లోని తప్పిదం వల్ల కలిగిన నష్టం కాబట్టి, అవసరమైతే ఒకసారి తనిఖీ చేసుకుని, ఈ మొత్తాన్ని పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వమే భర్తీ చేయాలి.

**(3) కేంద్ర ప్రాయోజిత పథకాలు (సిఎస్ఎస్)లో కేంద్ర నిధుల వాటా 90 శాతానికి బదులుగా ప్రత్యేక సాయం**

సిఎస్ఎస్‌లో కేంద్ర నిధుల వాటా 90 శాతానికి బదులుగా రూ.16,447 కోట్లు కేంద్రం రాష్ట్రానికి చెల్లించాల్సి ఉంది. ఈ ప్రత్యేక సాయాన్ని అందించటానికి ఇఎపి (విదేశీ తోడ్పాటు ప్రాజెక్టుల) పద్ధతి ఏ మాత్రం సరిపోదు. దీని ద్వారా ఇప్పటిదాకా అరకొర నిధులే విడుదలయ్యాయి.

కాబట్టి, ఇతర మార్గాల ద్వారా సాయం అందించాలి. రాష్ట్రాన్ని పెండింగ్ ఇఎపి రుణాలు, ప్రత్యేక అభివృద్ధి రుణాలు, కేంద్ర ప్రభుత్వానికి లేదా పాక్షిక ప్రభుత్వ సంస్థలకు ఉన్న ఇతర రుణాల చెల్లింపులకు అనుమతించటం, గ్రాంట్‌కు బదులుగా నాబార్డ్, హడ్కో తదితర దేశీయ రుణదాతల నుంచి అప్పులు తీసుకోవటానికి అనుమతించటం, ఇఎపిలకు తిరిగి చెల్లింపుల బాధ్యతను కేంద్ర ప్రభుత్వమే తీసుకుంటుంది కాబట్టి రాష్ట్ర ఎఫ్ఆర్‌బిఎం పరిమితి నుంచి ప్రత్యేక సాయాన్ని మినహాయించటం, ఆంధ్రప్రదేశ్ సహాయ బాండ్లను స్వల్ప, మధ్యకాల వ్యవధికి విడుదల చేయటం- వంటి మార్గాల ద్వారా కేంద్రం ప్రత్యేక సాయాన్ని అందించాలి.

**(4) పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయటానికి అవసరమైన సాయం**

పోలవరం ప్రాజెక్టు మొదటి దశను 2019 నాటికి పూర్తి చేయటానికి, అంతకుముందు చేసిన వ్యయం తాలూకు పెండింగ్‌లో ఉన్న బిల్లులకూ కలిపి రూ.8,711.19 కోట్లు, రెండవ దశను పూర్తి చేయటానికి 2019-20లో రూ.27,494 కోట్లూ కేంద్ర సాయంగా అందాలి.

సవరించిన ప్రాజెక్టు వ్యయ అంచనాలను నిబంధనలకనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించవచ్చు.

పోలవరం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చక్కని సమన్వయంతో

వ్యవహరించాయి. ప్రాజెక్టు పురోగతి ఆకట్టుకునేలా ఉంది. ప్రాజెక్టు రెండు దశలనూ నిర్ణీత కాలవ్యవధితో పూర్తి చేసే విధంగా తగినన్ని నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి.

**(5) వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సహాయం**


వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 24,350 కోట్ల అంచనాతో ప్రతిపాదనల్ని రూపొందించింది. జనాభా, ద్రవ్యోల్బణాలకనుగుణంగా ఇది దాదాపుగా బుందేల్‌ఖండ్ ప్యాకేజీతో సమానంగా ఉంది.

కేంద్రం వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద ఇప్పటిదాకా 3 ఏళ్ల పైచిలుకు కాలానికి రూ. 1,050 కోట్లను విడుదల చేసింది. రానున్న సంవత్సరాలలో రూ. 700 కోట్లు చెల్లించనుంది. కేంద్రం ఇచ్చిన కమిట్‌మెంట్‌కి, వెనుకబడిన రాయలసీమ, ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాల అవసరాలకు - జిల్లాకు రూ. 50 కోట్ల చొప్పున చేస్తున్న సాయానికి హస్తిమసి కాంతరముంది.

ఐదేళ్ల గడువులో నిర్ణీత కాల పద్ధతిలో రూ. 24,350 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలకు అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవాలి.

**(6) దుగ్గరాజపట్నం మరియు/లేదా ప్రత్యామ్నాయ పోర్టు నిర్మాణం**

దుగ్గరాజపట్నం వద్ద నౌకాశ్రయం అభివృద్ధికి రూ. 7,988 కోట్లు ఖర్చవుతుందని తాత్కాలికంగా అంచనా వేశారు. అయితే, ఆ ప్రాంతంలో పోర్టు ఏర్పాటుకఆచరణలో నష్టదాయకమని కేంద్ర ప్రభుత్వం తేల్చింది. ప్రత్యామ్నాయంగా మరో ప్రాంతాన్ని సూచించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.



సాధ్యాసాధ్యాల విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తేల్చుకుని పోర్టు ఏర్పాటుకు ఆచరణరీత్యా సరైన ప్రాంతమేదో త్వరగా నిర్ధారించి, ఏమాత్రం ఆలస్యం లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పోర్టు అభివృద్ధిని అమలు చేయాలి.

**(7) జాతీయ ప్రాధాన్యత గల పదకొండు సంస్థలను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయటం**

రూ. 12,746.38 కోట్ల మేర ఉన్న మొత్తం ప్రాజెక్టులో కేవలం 845.42 కోట్లను, అంటే 6.63 శాతాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా విడుదల చేసింది. 93 శాతం ఇంకా చెల్లించాల్సి ఉంది. విద్య, వైద్య ఇలా దాదాపు అన్ని సంస్థలూ తాత్కాలిక ప్రాంగణాల్లో పనిచేస్తున్నాయి.

మిగిలిన నిధుల్ని విడుదల చేసి అన్ని సంస్థలనూ 2024లోగా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి.

**(8) ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతులు, రవాణా అనుసంధానత, పెట్టుబడుల ప్రాజెక్టులు**

పదమూడో షెడ్యూల్‌లోని మౌలిక వసతుల ప్రాజెక్టులను సమీక్షిస్తే.. ఐదు ప్రాజెక్టులు అమలు కాలేదని, మూడు అమలు తొలి దశలో ఉన్నాయని తేలింది. వీటిల్లో.. పెట్రో కెమికల్ కాంప్లెక్స్, మెట్రో రైలు ప్రాజెక్టులు, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్ (విసిఐసి), రాజధాని ప్రాంతానికి వేగవంతమైన రైలు, రోడ్డు రవాణా సంధానత, అంతర్జాతీయ విమానాశ్రయాలు కీలకం. పరిశ్రమలు, సేవల రంగాల్లో తక్కువ ఉద్యోగావ కాశాలున్న ఆంధ్రప్రదేశ్‌లో.. ఈ ప్రాజెక్టులు ఆర్థిక కలాపాలకు ఉద్దీపననిచ్చి, పెట్టుబడులను పెంచుతాయి. పరిశ్రమలు, ఉద్యోగావకాశాలకు ఊపునిస్తాయి. కాబట్టి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను హెచ్చించే ఈ ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం ఉదారంగా తోడ్పాటునందించాలి.

**(9) ప్రభుత్వ మౌలిక వసతులు, రాజధాని ప్రాంతం అభివృద్ధికి సాయం**

ఇప్పటిదాకా రాజధాని అభివృద్ధికి రూ. 1,500 కోట్లను కేంద్రం విడుదల చేసింది. రాష్ట్రం రూ. 1,632.48 కోట్లకు వినియోగ ధృవపత్రాల (యు.సిలు)ను సమర్పించింది. ఈ యు.సిల ఆధారంగానే నీతి ఆయోగ్ రూ. 666 కోట్లను

వెంటనే, రూ.334 కోట్లను 2019-20లో విడుదల చేయాలని కేంద్రానికి సిఫార్సు చేసింది.

ఇవికాక వేరేగా, విజయవాడ, గుంటూరు నగరాల్లోని భూగర్భ, వరద నీటి డ్రైనేజి కోసం రూ.1,000 కోట్లను విడుదల చేశారు.




ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014లోని సెక్షన్ 94 (3)ని కేంద్ర ప్రభుత్వం ఉదారంగా పరిగణలోకి తీసుకోవాలి. ప్రభుత్వ కాంప్లెక్స్‌కు అదనంగా, రహదారులు, వరద నీటి డ్రైనేజి, వరద నివారణ, పారిశుద్ధ్యం, మురుగు పారుదల, మంచినీరు, వేగవంతమైన రవాణా అనుసంధానత, మాస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ మౌలిక వసతుల్ని కూడా 'ఇతర ముఖ్యావసర మౌలిక సదుపాయాలు'గా పరిగణించాలి.

అమరావతి అభివృద్ధికి సంబంధించిన అన్ని ప్రాజెక్టులూ – నీతి ఆయోగ్/కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం సమర్పించిన డిపిఆర్‌లు, ఇంకా రూపుదిద్దుకునే దశలో ఉన్నవి కూడా – నగరాన్ని ప్రధాన గ్రీన్ ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల్లో, అవసరమైన పౌర వసతులతో ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు.. పైన పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఇతర ముఖ్యావసర మౌలిక వసతుల్ని కూడా ఎపిఆర్ఎ, 2014లోని సెక్షన్ 94 (3) పరిధిలోకి వచ్చే ప్రాజెక్టులుగా పరిగణించాలి.

ఈ నేపథ్యంలో, 'ముఖ్యావసర సదుపాయాలు', పైన పేర్కొన్న అంశాల పరిధిలోని 'ఇతర ముఖ్యావసర మౌలిక వసతులు'కు సంబంధించిన ప్రాజెక్టులను గుర్తించేందుకు, డిపిఆర్‌లలో పేర్కొన్న అంచనా వ్యయాల్ని సమీక్షించేందుకు, ఈ అంశాలకు కావలసిన వనరుల్ని అంచనా వేసేందుకు పట్టణ ప్రణాళిక, అభివృద్ధి నిపుణులతో కూడిన కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. అటువంటి అంచనా ఆధారంగా, రాష్ట్రానికి కేంద్రం సహాయాన్ని అందించాలి.

అటవీ భూమి (2087.09 హెక్టార్లు) బదిలీని భారత ప్రభుత్వం వేగవంతం చేసి, గ్రేహౌండ్ శిక్షణా కేంద్రానికి ఆమోదించిన ప్రాజెక్టు వ్యయం రూ.219.16 కోట్లను విడుదల చేయాలి.

**(10) ఆంధ్రప్రదేశ్‌కు పన్ను, మరియు ఇతర రాయితీలు**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పెట్టుబడులకు పన్ను రాయితీలు సంక్లిష్టమైన, చతురమైన, వివాదాస్పదమైన అంశం. ఈ సంక్లిష్ట అంశాన్ని పరిష్కరించటానికి పలు మార్గాలను పరిగణలోకి తీసుకోవచ్చు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, రాయితీలను ఆ ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయటం అందులో ఒక ఆచరణయుక్తమైన మార్గం. చాలా ప్రత్యేక తరగతి రాష్ట్రాలకు ఇచ్చినట్లు పూర్తి పన్ను మినహాయింపుల్ని కాకుండా.. ఇప్పుడిస్తున్న రాయితీలకంటే గణనీయంగా పెంచి పన్ను మినహాయింపు ప్రయోజనాల్ని మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు విస్తరింపచేయటం రెండో పద్ధతి. మూడోది, ఇతర రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మిగిలిన భారతదేశంలో గుర్తించిన వెనుకబడిన ప్రాంతాలకు కూడా పూర్తి పన్ను రాయితీ ప్రయోజనాల్ని అందించటం.

ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం అదనంగా ఆంధ్రప్రదేశ్‌లో 100 శాతం ఆర్థిక సాయంతో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధికనుగుణంగా చేపట్టాలి. సహజ వనరులు, స్థానిక నైపుణ్యాలు, మార్కెట్ సామర్థ్యం ఆధారం చేసుకుని.. పారిశ్రామిక మౌలిక వసతుల ఆధునీకరణ పథకం (ఐఐయుఎస్), మెగా ఫుడ్ పార్క్ పథకం, సమీకృత మౌలిక సదుపాయాల అభివృద్ధి (ఐఐడి) పథకం వంటి సముదాయ పథకాల తరహాలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టవచ్చు. ■

# రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వ హామీల అమలు తీరుపై స్వతంత్ర నిపుణుల బృందం (ఐజిఇ) నివేదిక (జనవరి, 2019)లోని కొన్ని భాగాలు తెలుగులో స్థూలంగా..

(ఇందులో పేర్కొన్న పట్టికలు, ఎనెగ్జర్లు, చిత్రాల వివరాల్ని ఆంగ్ల మూలంలో చూడవచ్చు.
కాపీల వివరాలకు: www.fdrindia.org)

## ఐజిఇ బృందం వివరాలు

### స్వతంత్ర నిపుణుల బృందం

| | |
|---|---|
| 1. శ్రీ అజేయ్ కల్లాం | ఐఏఎస్ (రిటైర్డ్), ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి |
| 2. శ్రీ సి. ఆంజనేయ రెడ్డి | ఐపీఎస్ (రిటైర్డ్), తెలంగాణ పోలీసు అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ |
| 3. శ్రీ వి. భాస్కర్ | మాజీ ఆర్థిక కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ |
| 4. శ్రీ చెంగల్‌రెడ్డి | సెక్రటరీ జనరల్, భారత రైతుల సంఘాల కన్సార్టియం (సిఫా) |
| 5. శ్రీ హెచ్‌జె దొర | ఐపీఎస్ (రిటైర్డ్), మాజీ సివిసి |
| 6. డాక్టర్ ఎస్. గలాబ్ | డైరెక్టర్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) |
| 7. శ్రీ కె. మాధవరావు | ఐఏఎస్ (రిటైర్డ్), ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ |
| 8. జస్టిస్ ఎంఎన్ రావు | హిమాచల్‌ప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి, వెనుకబడిన వర్గాల జాతీయ కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ |
| 9. శ్రీ కె.పద్మనాభయ్య | ఐఏఎస్ (రిటైర్డ్), కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి |
| 10. జస్టిస్ పర్వతరావు | మాజీ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు |
| 11. ప్రొఫెసర్ ఆర్. రాధాకృష్ణ | ఛైర్మన్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ |
| 12. డాక్టర్ రాఘవాచారి | మాజీ సంపాదకులు, విశాలాంధ్ర |
| 13. డాక్టర్ కె. సుజాతారావు | ఐఏఎస్ (రిటైర్డ్), భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి |
| 14. డాక్టర్ కెఆర్ వేణుగోపాల్ | రిటైర్డ్ ఐఏఎస్, భారత ప్రధానమంత్రి మాజీ కార్యదర్శి |
| 15. డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ | కన్వీనర్, స్వతంత్ర నిపుణుల బృందం, ప్రధాన కార్యదర్శి, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డిఆర్) |

| జాతీయ నిపుణుల బృందం | |
|---|---|
| 1. డాక్టర్ యోగిందర్ కె. అలఘ్ | ఛాన్సలర్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ గుజరాత్<br>వైస్ ఛైర్మన్, సర్దార్ పటేల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ సోషల్ రీసెర్చి,<br>మాజీ మంత్రి, కేంద్ర విద్యుత్, ప్రణాళిక, సైన్స్ అండ్ టెక్నాలజీ |
| 2. డాక్టర్ అతుల్ శర్మ | ఛైర్మన్, ఓకెడిఐఎస్‌సిడి, గువహతి,<br>సభ్యులు, పదమూడవ ఆర్థిక సంఘం,<br>ఐసిఎస్ఎస్ఆర్ నేషనల్ ఫెలో,<br>వైస్ ఛాన్సలర్, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ,<br>ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి, ఆచార్యులు, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఢిల్లీ సెంటర్ |
| 3. డాక్టర్ ఎం. గోవిందరావు | సభ్యులు, 14వ ఆర్థిక సంఘం,<br>డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ, న్యూఢిల్లీ,<br>మాజీ సభ్యులు, ప్రధానమంత్రి ఆర్థిక సలహా సంఘం,<br>మాజీ డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ అండ్ ఎకనామిక్ ఛేంజ్, బెంగళూరు |
| 4. ప్రొఫెసర్ కె.ఆర్ షణ్ముగం | డైరెక్టర్, ప్రొఫెసర్ మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, చెన్నై |



# 2014-15 సంవత్సరానికి వనరుల లోటు

**కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిర్దిష్ట హామీ :**

**ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 46 (2)**

"(2) సబ్‌సెక్షన్ (1)లో ఉన్నదానితో నిమిత్తం లేకుండా, మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు అందుబాటులో ఉన్న వనరులనుబట్టి, కేంద్రం తగిన విధంగా నిధులు కేటాయించవచ్చు. ఆ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకోసం ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ రూపంలో తగిన ఆర్థిక ప్రయోజనాల్ని, రాయితీల్ని కల్పించవచ్చు."

**ఫిబ్రవరి 20, 2014న పార్లమెంటులో ప్రధానమంత్రి చేసిన ప్రకటనలోని 6వ పేరా:**

"ఆరవది, పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు మొట్టమొదటి సంవత్సరం, మరీ ముఖ్యంగా అవతరణ రోజు నుంచి 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల్ని భారత ప్రభుత్వం ఆమోదించే మధ్య వ్యవధిలో ఉత్పన్నమయ్యే అవకాశమున్న వనరుల లోటును, కేంద్ర బడ్జెట్ 2014-15లోనే భర్తీ చేయటం జరుగుతుంది."

**ఎప్పుడేం జరిగింది?**

**(పరిణామాల కాలపట్టిక)**

**20 మార్చి, 2014**

జూన్ 2, 2014 నుంచి మార్చి 31, 2015 వరకు పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు తలెత్తే అవకాశమున్న వనరుల లోటును అంచనా వేయటానికి ప్రణాళికా సంఘం, ఆర్థిక, హోం శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సీనియర్ అధికారులతో సంయుక్త సంఘాన్ని ఏర్పాటు చేయాలని మార్చి 20, 2014న, రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉండగా అప్పటి అవిభజిత ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వనరుల లోటును పూడ్చేందుకు 2014-15 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపు చేయటానికి ఈ కసరత్తు అవసరం. తదనుగుణంగా, కేంద్ర ప్రభుత్వం ప్రణాళికా సంఘం, హోం వ్యవహారాలు, ఆర్థిక మంత్రిత్వ శాఖల అధికారులతో సంయుక్త కమిటీని ఏర్పాటు చేసింది, అయితే అందులో ఆంధ్రప్రదేశ్ అధికారులు లేకుండా (ఎనెగ్జర్-4).

**ఏప్రిల్ - మే 2014**

- వనరులకు సంబంధించిన తగిన సమాచారాన్ని సంయుక్త కమిటీకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏప్రిల్, మే 2014లో అందించింది.

- 2014-15 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్ నుంచి రూ. 15,691 కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మే 27, 2014న కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది (ఎనెగ్జర్-5). అయితే, కేంద్ర బడ్జెట్ 2015-16లో అటువంటి కేటాయింపు ఏదీ చేయలేదు.

- ఆర్థిక సంవత్సరంలో తలెత్తే వనరుల లోటును పాక్షికంగా పూడ్చటానికి 2014-15లో కేంద్ర ప్రభుత్వం రూ. 2,303 కోట్లను తాత్కాలిక ప్రాతిపదికన నూతన ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది.

**2014-15**

- 2014-15 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక జమాఖర్చులను ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ మదింపు చేశారు. మొత్తం రూ. 16,078.76 కోట్ల రెవెన్యూ లోటు ఉందని సిఏజి అంచనా వేసి, సర్టిఫై చేశారు. కేంద్రం ఇచ్చిన తాత్కాలిక గ్రాంట్ రూ. 2,303 కోట్లను పరిగణలోకి తీసుకుంటే, ఆ ఏడాది నికర రెవెన్యూ లోటు రూ. 13,775.76 కోట్లు.

- ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం 2015లో రూ. 500 కోట్లను, 2016లో రూ. 1,176.50 కోట్లను.. 2014-15 వనరుల లోటు భర్తీలో భాగంగా విడుదల చేసింది. ఈ విధంగా, కాగ్ అంచనా వేసిన రెవెన్యూ లోటు రూ. 16,078.76లో కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ. 3979.50 కోట్లను విడుదల చేసింది.

**2016**

- 2016, సెప్టెంబర్ 8న కేంద్ర ప్రభుత్వం ఈ దిగువ బహిరంగ ప్రకటన చేసింది (ఎనెగ్జర్-6):

"ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద 2014-15 సంవత్సరానికి వనరుల లోటును భర్తీ చేయాల్సిన నిర్దిష్ట హామీ బాధ్యతని ఆ ఏడాది ప్రమాణీకరించిన వ్యయం ప్రాతిపదికన పూరించాం. కొన్ని పింఛను పథకాల గణాంకాలకు సంబంధించి సర్దుబాట్లు మిగిలి వున్న దృష్ట్యా రెవెన్యూను ఉజ్జాయింపుగా

అంచనా వేశాం. రెవెన్యూ వ్యత్యాసంలోని కొంతభాగాన్ని రూ.3,979.5 కోట్ల మేర ఇప్పటికే చెల్లించటం జరిగింది. మిగిలిన మొత్తాన్ని వార్షిక వాయిదా పద్ధతిలో చెల్లిస్తాం."

**2017**

తర్వాత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేవలం రూ.138.39 కోట్ల అదనపు మొత్తం మాత్రమే విడుదల చేస్తున్నట్లు మే 4, 2017న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి కేంద్ర ఆర్థిక మంత్రి తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన కొన్ని వ్యయాలను కొత్త స్కీములుగా పరిగణించి తిరస్కరించటం, వేతన సవరణ సంఘ (పిఆర్‌సి) సిఫార్సుల పాత బకాయిలను ప్రభుత్వం పెంచి ప్రభుత్వోద్యోగులకు చేసిన చెల్లింపుల్ని పరిగణలోకి తీసుకోకపోవటం వల్ల చివరికి ఈ మొత్తం మాత్రమే తేలిందని తెలిపారు. కొత్త పథకాలుగా, అనుమతించనివిగా కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న వ్యయాన్ని టేబుల్-1.1లో ఇచ్చాం.

**పట్టిక-1.1**

| కొత్త పథకాల విభాగంలో చేర్చిన వ్యయ వివరాలు | |
|---|---|
| | **(రూ. కోట్లలో)** |
| 1. వ్యవసాయ రుణ విముక్తి | |
| ఎ) రుణ మాఫీ | 3,068.35 |
| బి) రైతు సాధికార సంస్థకు సాయం | 4,001.32 |
| 2. సామాజిక భద్రతా పింఛన్లు | 3,391.20 |
| 3. విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లకు ఆర్థిక పునర్నిర్మాణ ప్యాకేజీ | 1,500.00 |
| **మొత్తం:** | **11,960.87** |

2014-15 ఆర్థిక సంవత్సరంలో చేసిన పై వ్యయానికి అదనంగా.. ఆ సంవత్సరం చేసిన ఖర్చుల్ని, వనరుల లోటు, ఆదాయావకాశాల్లో అనిశ్చితి వల్ల తదుపరి సంవత్సరానికి బదిలీ అయిన వ్యయాల్ని కూడా రాష్ట్రం భరించాల్సి ఉంటుంది. విభేదించిన (డిఫర్డ్) వ్యయం వివరాల్ని టేబుల్-1.2లో చూడొచ్చు.

**పట్టిక 1.2**

| **2014-15కు సంబంధించి విభేధించిన వ్యయం** | |
|---|---|
| | (రూ. కోట్లలో) |
| పిఆర్‌సి బకాయిలు | 3,920 |
| విభేధించిన బిల్లులు | 2,950 |
| **మొత్తం:** | **6,870** |

ఈ విధంగా, 2014-15 ఆర్థిక సంవత్సరంలో వనరుల లోటును భర్తీ చేసుకోవటం నిమిత్తం రాష్ట్రం కోరుతున్న గ్రాంట్‌ను టేబుల్-1.3లో చూడవచ్చు.

**పట్టిక 1.3**

| **2014-15 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం వనరుల లోటు** | |
|---|---|
| | (రూ.కోట్లలో) |
| రెవెన్యూ లోటు | 16,078.76 |
| ఆదాయ సమీకరణ మార్గాల్లో ప్రతిబంధకాల వల్ల విభేదించిన వ్యయం | 6,870.00 |
| **మొత్తం:** | **22,948.00** |

ఇందులో, కేంద్ర ప్రభుత్వం రూ.4,118.00 కోట్లు ఇవ్వటానికి నిర్దిష్ట హామీని ఇచ్చింది. ఈ మొత్తంలో రూ.3,979.50 కోట్లను ఇప్పటిదాకా విడుదల చేసింది. వనరుల లోటు, తిరస్కరించిన మొత్తాలు, 2014-15లో ఖర్చు చేయని, ఆదాయ, సాధనావకాశాల పరిస్థితుల దృష్ట్యా వాయిదా వేసిన వ్యయం.. ఈ మొత్తాన్నీ టేబుల్- 1.4లో క్రోడీకరించటం జరిగింది.

కేంద్రం అనుమతించని వ్యయాలు, ఆదాయవకాశాల సమస్యల దృష్ట్యా వాయిదా వేసిన వ్యయాల గురించి ఈ దిగువ వరుస క్రమంలో చర్చించటం చర్చించటం జరిగింది.

**ఎ. అనుమతించని వ్యయం**

1. డిస్కమ్‌లకు ఆర్థిక సాయం
2. సామాజిక భద్రతా పింఛన్లు
3. వ్యవసాయ రుణ విమోచన
4. రైతు సాధికార సంస్థకు సాయం

బి. వనరుల లోటు కారణంగా విభేదించిన వ్యయం

5. పిఆర్‌సి బకాయిలు
6. విభేదించిన బిల్లులు

**ఎ. అనుమతించని వ్యయం**

**1. 'డిస్కమ్'లకు ఆర్థిక సహాయం**

**విద్యుత్తు పంపిణీ సంస్థల (డిస్కమ్)కు ఆర్థిక పునర్నిర్మాణ ప్యాకేజీ (ఎఫ్ఆర్‌పి):**

రాష్ట్ర ప్రభుత్వ డిస్కమ్‌ల పనితీరును, ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ అక్టోబర్ 5, 2012న ఓ.ఎం నెం.20/11/2012 ద్వారా ఒక పథకాన్ని నోటిఫై చేసింది. ఆ స్కీమ్ ప్రకారం స్వల్పకాల అప్పుల్లో 50 శాతానికి డిస్కమ్‌లు రాష్ట్ర ప్రభుత్వం తరపున బాండ్లు జారీ చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం 3-5 ఏళ్లలో వీటిని తీసుకుంటుంది. ఈ బాండ్లు జారీ చేసిన తేదీ నుంచి మూల మొత్తాన్ని, వడ్డీని చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంటుంది. ప్రత్యేక సెక్యూరిటీల జారీ ఎఫ్.ఆర్.బి.ఎం (ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం) పరిధిలోనే ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాలి. అలాగే సంబంధిత ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ నికర అప్పుల గరిష్ట పరిమితిలోనే రాష్ట్రం ఉండాలి (ఎనెగ్జర్-7)

తదనుగుణంగా, పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ.8,600 కోట్లకు గ్యారంటీ ఇవ్వగా, డిస్కమ్‌లు 2013-14లో బాండ్లు జారీ చేశాయి. ఇందులో, రూ.3,610.82 కోట్లు కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు పంపకమయ్యాయి. ఈ రకంగా, డిస్కమ్‌ల అప్పు భారం రూ.1,500 కోట్లను 2014-15లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. పద్ధతిని అనుసరించి, రూ.1,514.82 కోట్ల అప్పుల్ని తీసుకునేందుకు రాజ్యాంగంలోని 293 (3) ప్రకరణననుసరించి భారత ప్రభుత్వ ఆమోదాన్ని పొందింది. మార్చి 13, 2015న కేంద్ర ఆర్థిక శాఖ లెటర్ నెం. 40(1) పిఎఫ్-1/2011 ద్వారా అప్పులకి అనుమతిచ్చింది. బాండ్లను తీసుకోవటానికి స్పెషల్ సెక్యూరిటీల జారీకి రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) అనుమతినిచ్చింది (ఎనెగ్జర్-8). తదనుగుణంగా, బాండ్ల ద్వారా రూ.1,500 కోట్లను సేకరించారు. ఆ మొత్తాన్ని డిస్కమ్‌లకు పంపిణీ చేశారు. డిస్కమ్‌లకు తోడ్పాటుగా ఎఫ్ఆర్‌పి బాండ్లు -310-గ్రాంట్స్-ఇన్-ఎయిడ్-312 ఇతర గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ తీసుకున్నందుకు రూ.1,500 కోట్లను ఎకౌంట్ నెంబర్ 2801-05-800-(12)లో ఖర్చుగా నమోదు చేశారు. తదనుగుణంగా, ఫైనాన్స్ విభాగం (పిఎఫ్ అండ్ నాబార్డ్) నుంచి జీవో ఎంఎస్ నెం.34తో ఆదేశాల్ని మార్చి 31, 2015న జారీ చేసింది (ఎనెగ్జర్-9). ఈ మొత్తాన్నీ డిస్కమ్‌లకు బదిలీ చేసినందున, భారత ప్రభుత్వం జారీ చేసిన వర్గీకరణను అనుసరించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ దీన్ని రెవెన్యూ ఖర్చుగా పేర్కొనటం జరిగింది.

కేంద్ర ఆర్థిక శాఖ (ఎకనామిక్ ఎఫైర్స్ విభాగం) మే 19, 2011న జారీ చేసిన గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ అకౌంటింగ్ అండ్ క్లాసిఫికేషన్ నోటిఫికేషన్‌లోని 14వ నిబంధన ప్రకారం, ఈ మొత్తం గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ కిందికి వస్తుంది. కాబట్టి అకౌంటెంట్ జనరల్ దీన్ని రెవెన్యూ ఖర్చు కింద పేర్కొన్నారు. ఆ తర్వాత, ఈ రూ.1,500 కోట్ల మొత్తాన్ని రాష్ట్రం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకంలో భాగంగా ఈ డబ్బుని 2014-15 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం తిరిగి కట్టాల్సి ఉంది.

కాబట్టి, ఈ వ్యయం అసాధారణమేమీ కాదు, దీన్ని ఓ కొత్తపథకం కింద చెప్పలేరు. ఓ కార్యక్రమం కొనసాగింపులో భాగంగా చేసిన వాస్తవిక, ప్రామాణిక రెవెన్యూ వ్యయం ఇది.

దీన్ని ఆ ఏడాది రెవెన్యూ లోటులో భాగంగా చేయాల్సిందే.

అందుచేత, డిస్కమ్‌ల ఆర్థిక పునర్నిర్మాణ ప్రణాళిక (ఎఫ్‌ఆర్‌పి)లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెచ్చించిన రూ.1,500 మొత్తాన్ని తన నిర్దిష్ట హామీ ప్రకారం, కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిందే.

**2. సామాజిక భద్రతా పెన్షన్లు**

సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ భారత ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే జరుగుతోంది. నూతన ఆంధ్రప్రదేశ్‌లో పింఛనుదార్ల సంఖ్య 2014-15లో పెరగలేదు. టేబుల్ 7లో చూడొచ్చు. పంపిణీ చేసిన నెలవారీ పెన్షన్ల సంఖ్య 2013-14లో ఉన్న 5.03 కోట్ల నుంచి 2014-15లో 4.56 కోట్లకు తగ్గినట్టు కూడా ఇందులో తేటతెల్లమవుతుంది.

**పట్టిక 1.5**

| సంవత్సరం | పంపిణీ చేసిన నెలవారీ పింఛన్ల సంఖ్య |
|---|---|
| 2011-12 | 4,75,34,593 |
| 2012-13 | 5,87,16,762 |
| 2013-14 | 5,03,01,295 |
| 2014-15 | 4,55,71,809 |

పింఛను మొత్తాల్ని ఆ సంవత్సరం పెంచారు. ఈ పెంపుదలలు భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అక్టోబర్ 2014న జారీ చేసిన నిబంధనలకనుగుణంగానే ఉన్నాయి. జాతీయ సామాజిక మద్దతు కార్యక్రమం మార్గదర్శకాలలోని 2వ అధ్యాయం (పేజీ 8)లోని వాక్యాన్ని దిగువన ఉటంకిస్తున్నాం: (ఎనెగ్జర్ - 10)

**2.4.1. "లబ్ధిదారులకు 'కాస్త గౌరవప్రదమైన సాయం' అందించటం కోసం రాష్ట్రం 'కనీసం' అంతేసొమ్మును జోడింపు (మ్యాచింగ్) గా ఇవ్వాలి."**

ఈ పింఛన్లకోసం భారత ప్రభుత్వం 80 ఏళ్ల వయసులోపు ఉన్నవారికి నెలకు రూ.200, 80 ఏళ్లు పైబడినవారికి నెలకు రూ.300 చొప్పున అన్ని రాష్ట్రాలకూ నిధులిస్తోంది. లబ్ధిదారులకు 'కాస్త గౌరవప్రదమైన సాయం' అందించటం కోసం రాష్ట్రం 'కనీసం' అంతేసొమ్మును జోడింపు (మ్యాచింగ్) గా ఇవ్వాలి. విభజన తర్వాత భారత ప్రభుత్వ మార్గదర్శకాలు, పెరుగుతున్న జీవన వ్యయాలను తట్టుకుని పేద కుటుంబాలు తమ అవసరాలను నెరవేర్చుకోవటాన్ని దృష్టిలో పెట్టుకుని 2014-15 ఆర్థిక సంవత్సరంలో పింఛను మొత్తాల్ని పెంచారు. వృద్ధులు, వితంతువులు, నేతకారులు, గీతకారులు, ఏఆర్‌టీ కేసులు (చికిత్స పొందుతున్న హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు), 40 నుంచి 79 శాతం అవయవలోపం ఉన్న దివ్యాంగులకు నెలకు రూ.1000, 80 శాతం లోపం ఉన్న దివ్యాంగులకు రూ.1500 పింఛను ఇవ్వటం ప్రారంభించారు. కాబట్టి సామాజిక భద్రతా పింఛన్ల ఖర్చును.. కొనసాగింపు కార్యక్రమంలో భాగంగా, సాధారణ, ప్రమాణీకరించిన వ్యయంగానే పరిగణించాలి.

పెన్షన్‌లో పెంచిన మొత్తాల్ని కొత్తగా చేసే, అప్రామాణిక ఖర్చుగా పరిగణించినా కూడా, అన్ని రాష్ట్రాలకూ కేంద్ర ప్రభుత్వ సాయం 80 ఏళ్ల లోపు వారికి నెలకు రూ.200, 80 దాటినవారికి నెలకు రూ.300గా ఉందని గమనించాలి. అన్ని రాష్ట్రాలకూ వర్తించే ఈ సాధారణ రాయితీ ప్రకారం చూసినా ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సింది రూ.946.90 కోట్లు అవుతుంది. అదనంగా, సామాజిక భద్రతా పింఛన్లకు ఆంధ్రప్రదేశ్ రూ.2,628.91 కోట్లు ఖర్చు చేసింది. ప్రామాణికంగా కేంద్రం ఇచ్చే మొత్తాలకు సమానమొత్తాల్నే కేంద్రం తాను భర్తీ చేసే వనరుల లోటుగా పరిగణలోకి తీసుకుంటారనుకున్నా కూడా, మ్యాచింగ్ మొత్తంగా రూ.946.90 కోట్లను 2014-15లో తలెత్తే రెవెన్యూ లోటులో భాగంగా కేంద్రం భర్తీ చేయాలి.

ఏమైనా, భారత ప్రభుత్వం 2014-15కు ఎన్‌టైటిల్‌మెంట్‌ను రూ.93.94 కోట్లుగానే (2013-14కు సంబంధించిన రూ.91.27 కోట్ల బకాయిలను 2014-15లో చెల్లించారు) లెక్కేసింది. ఈ మదింపులో పొరపాటు దొర్లినట్లు భావించటానికి ఆస్కారముంది. ఒక నెల సబ్సిడీని మాత్రమే పరిగణలోకి తీసుకుని పొరబడి ఉండవచ్చు. సామాజిక భద్రతా పింఛన్లపై అన్ని రాష్ట్రాలకూ ఇస్తున్న నిబంధనల ప్రకారమే ఆంధ్రప్రదేశ్‌కూ రాయితీ నిధులివ్వటం, రెవెన్యూ లోటులో భాగంగా రాష్ట్రం ఇచ్చే కనీస మ్యాచింగ్ గ్రాంట్ వాటాను భర్తీ చేయటం కేంద్ర ప్రభుత్వ కనీస బాధ్యత. అదనంగా, అంతకముందు ఏడాది (2013-14)లో సామాజిక భద్రతా పెన్షన్ల బకాయి కింద రూ.91.27 కోట్లను 2014-15లో పంపిణీ చేశారు. ఈ రకంగా, సామాజిక భద్రతా పథకం కింద కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాల్సిన రెవెన్యూ లోటు ఈ దిగువ 1.6 పట్టికలో పేర్కొన్న విధంగా ఉంది:

పట్టిక 1.6

| సామాజిక భద్రతా పింఛన్ల వల్ల మొత్తం వనరుల లోటు | |
|---|---|
| | (రూ.కోట్లలో) |
| 1. 2014-15లో పంపిణీ చేసిన మొత్తం సామాజిక భద్రతా పింఛన్లు | 3,575.81 |
| 2. అన్ని రాష్ట్రాలకూ వర్తించే నిబంధనల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కి కేంద్ర ప్రభుత్వం బకాయి పడ్డ రాయితీ | 946.90 |
| 3. భారత ప్రభుత్వ జాతీయ స్థాయి నిబంధనల ప్రకారం పంపిణీ చేసిన అంతకు ముందు ఏడాది రాయితీ | 91.27 |
| 4. రాష్ట్రం తన వంతు విధిగా ఇవ్వాల్సిన మ్యాచింగ్ మొత్తం | 946.90 |
| 5. సాధారణ వ్యయం ప్రాతిపదికన రాష్ట్రానికి రాయితీగా, వనరుల లోటు | 1,985.07 |
| భర్తీలో భాగంగా బకాయిపడ్డ మొత్తం (2+3+4) | |

జాతీయ స్థాయిలో ఇస్తున్న మొత్తం కంటే ఎక్కువ మొత్తానికి రాష్ట్ర పింఛన్లను పెంచి, 2014-15లో సామాజిక పింఛన్ల కింద రూ.3,575.81 కోట్లను రాష్ట్రం వెచ్చించింది. అంతకుముందు సంవత్సరాల్లోని వ్యయానికనుగుణంగా రూ.1,985.07 కోట్లను మాత్రమే రెవెన్యూ లోటు భర్తీలో భాగంగా చెల్లించే 'ప్రామాణిక' వ్యయంగా భావిస్తే, ఈ మొత్తాన్ని 2014-15 రెవెన్యూ లోటు భర్తీ కమిట్‌మెంట్‌లో భాగంగా కేంద్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రీఇంబర్స్ చేయాలి. ఈ మేర భర్తీ చేసినా కూడా, సామాజిక భద్రతా పింఛన్ల కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,590.74 కోట్ల రెవెన్యూ లోటు ఉంటుంది. ఈ అదనపు వ్యయం ఒక వాస్తవిక పేదరిక నిర్మూలనా కార్యక్రమానికి చట్టనిబంధనల పరిధిలోనే వెచ్చించిన మొత్తం. కాబట్టి, రూ.1590.74 కోట్ల రీఇంబర్స్‌మెంట్‌ను కేంద్ర ప్రభుత్వం తన విచక్షణాధికారంతో పరిశీలించవచ్చు.

మొత్తంగా, సామాజిక భద్రతా పింఛన్ల కింద రూ.1985.07 కోట్ల ఖర్చును కేంద్ర ప్రభుత్వం రీఇంబర్స్ చేయాలి. రూ.1590.74 కోట్ల అదనపు ఖర్చును కూడా రీఇంబర్స్ చేయటాన్ని కేంద్రం విచక్షణాధికారంతో పరిగణలోకి తీసుకోవచ్చు.

**3 & 4: వ్యవసాయ రుణ విముక్తి, రైతు సాధికార సంస్థకు తోడ్పాటు:**

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర సాయానికి సంబంధించి భారత ప్రభుత్వం (ఆర్థిక మంత్రిత్వ శాఖ) సెప్టెంబర్ 8, 2016న చేసిన బహిరంగ ప్రకటన (ఎనెగ్జర్-6)లోని 3వ పేరా ప్రకారం, "2013-14 సంవత్సరానికి వనరుల లోటును ఆ ఏడాది, ప్రమాణీకరించిన వ్యయానికి అనుగుణంగా భర్తీ చేయటమైంది". దీనర్థం, ఆంధ్రప్రదేశ్‌కే ప్రత్యేకమైన కొత్త కార్యక్రమాలు, లేదా కొనసాగుతున్న కార్యక్రమాలు, ప్రాజెక్టులకు అదనంగా, అసాధారణమైన రీతిలో ఇచ్చే హామీలను 'అప్రామాణిక' (నాన్-స్టాండర్డయిజ్డ్) వ్యయంగా పరిగణిస్తారు, 2014-15 ఆర్థిక సంవత్సరంలో వనరుల లోటు కింద భర్తీ వాటికి వర్తించదు. ఈ రకమైన తర్కంతో, 2014 ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన హామీల్ని నెరవేర్చే క్రమంలో కొత్తగా అమలు చేసిన వ్యవసాయ, గ్రామీణ రుణమాఫీ వ్యయాన్ని ప్రత్యేకమైనదిగా, కొత్తదిగానూ, అప్రామాణికమైనదిగానూ పరిగణించారు. వ్యవసాయ రుణ విముక్తి కింద చూపిన వ్యయం (రూ.3,068.32 కోట్లు)ను రుణమాఫీ కింద పంపిణీ చేయగా, మరో రూ.4,001.32 కోట్లను రైతు సాధికార సంస్థకు సాయంగా చూపారు. రైతులకు రుణమాఫీ అమలు చేయటానికి రాష్ట్ర సంచిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్) నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పివి)కి ఈ డబ్బుని మళ్లించారు. కాబట్టి, ఈ రెండు విభాగాల కింద వెచ్చించిన మొత్తం రూ.7,069.67 కోట్లను భారత ప్రభుత్వం ప్రత్యేకమైన, కొత్త, అప్రామాణికమైన వ్యయంగా పరిగణించింది.

ఏమైనా, 14వ ఆర్థిక సంఘం (ఎఫ్ఎఫ్‌సి) గ్రాంట్ తర్వాత కూడా, కేంద్ర ప్రభుత్వం 'పరిశేష ఆంధ్రప్రదేశ్ వనరులను పరిగణలోకి తీసుకుని అవసరమైన గ్రాంట్‌లను అందించాలి' అని చట్టంలోని 46 (2) సెక్షన్‌ను చూపుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాదిస్తోంది.

విభజన అమల్లోకి వచ్చిన రోజు నుంచి మిగిలిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2014-15లో తలెత్తే 'వనరుల లోటు'ను 2014-15 కేంద్ర సాధారణ బడ్జెట్‌లో భర్తీ చేస్తామన్నది ప్రధానమంత్రి పార్లమెంట్‌లో ఇచ్చిన కమిట్‌మెంట్! చట్టంలో పేర్కొన్నదీ, ప్రధానమంత్రి ప్రకటననూ పరిశీలిస్తే.. కేవలం రెవెన్యూ లోటు లేదా వనరుల లోటును కాకుండా మొత్తం 'మొత్తం అన్ని వనరుల లోటు'ను ప్రమాణీకరించిన వ్యయం ప్రాతిపదికన భర్తీ చేస్తామని చెప్పారని విశదమవుతుంది.

అయితే, రాజకీయ కోణంలో రాష్ట్రం ఎంచుకున్న అసాధారణ, కొత్త వ్యయీకరణ కమిట్‌మెంట్లపై కేంద్రాన్ని చెల్లించమని అడగటం తగదని సమంజసంగా భావించవచ్చు. కాబట్టి, 2014-15లో రైతు రుణమాఫీకి వెచ్చించిన రూ.7,069.67 కోట్లను కేంద్ర ప్రభుత్వం విధిగా చెల్లించాల్సిన అవసరం లేదు. రుణమాఫీకి రాష్ట్రానికి అటువంటి సాయం అందించటం కేంద్ర విచక్షణ పరిధిలోనే ఉంటుంది.

**బి. 2014-15 ఆర్థిక సంవత్సరానికి ఇచ్చిన హామీలకు సంబంధించి విభేదించిన వ్యయం**

చట్టంలో (సెక్షన్ 46 (2)), పార్లమెంటులో ప్రధానమంత్రి ప్రకటనలో కమిట్‌మెంట్ ప్రకారం రాష్ట్రానికి అందుబాటులో ఉన్న వనరులకనుగుణంగా, 2014-15లో రాష్ట్రానికి ఎదురయ్యే 'వనరుల లోటు'ను భర్తీ చేయటానికి 'తగిన గ్రాంట్'లను అందివ్వాలి. భారత ప్రభుత్వం గనక సకాలవ్యవధిలోనే వనరుల లోటును అంచనా వేసి, 2014-15 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనే ఆంధ్రప్రదేశ్‌కు గ్రాంట్‌గా ఇచ్చేసి ఉంటే, ఆ సంవత్సరానికి సంబంధించిన అన్ని రకాల అప్పులు, హామీలు, ముఖ్యంగా విధిగా చెల్లించాల్సిన, ప్రామాణికమైన వ్యయాలు మొత్తం కూడా భారత ప్రభుత్వం భర్తీ చేసే 'వనరుల లోటు' పరిధిలోకి వచ్చేసి ఉండేవి. అయితే, అటువంటి మదింపు కార్యక్రమమైతే జరగలేదు. 2014-15 ఆర్థిక సంవత్సరపు కేంద్ర బడ్జెట్‌లో వనరుల కేటాయింపు జరగలేదు. దానికి బదులుగా, 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.2,303 కోట్ల తాత్కాలిక (అడ్‌హాక్) గ్రాంట్‌ను ఇచ్చారు. ఇది 'కాగ్' (సిఏజి) ఆడిట్‌లో ఉంది. తర్వాత 2015-16లో మరో రూ.1,676.50 కోట్లను రెండు విడతలుగా ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేశారు.

2014-15 వనరుల లోటును భారత ప్రభుత్వం ఆ సంవత్సరమే భర్తీ చేయని కారణంగా, ఆ ఆర్థిక సంవత్సరం రాష్ట్రం చెల్లింపుల్లో తీవ్ర ఆదాయవనరుల ఒత్తిడిని ఎదుర్కొంది. దీంతో, చట్టబద్ధ కమిట్‌మెంట్లకు సంబంధించి రాష్ట్రం చేయాల్సిన వ్యయం 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి తర్వాతి సంవత్సరాలకు బదిలీ అయింది. 2015-20 మధ్యకాలంలో నూతన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక లోటు భర్తీకి 14వ ఆర్థిక సంఘం చేసిన గ్రాంట్ రూ.22,113 కోట్లు మొత్తాన్ని మార్చటం సాధ్యం కాదు. అది సమీక్ష పరిధిలోకి రాదు. ఆర్థిక సంఘం 2015-16 నుంచే లోటును పరిగణలోకి తీసుకుంది తప్ప 2014-15 ఆర్థిక సంవత్సరం లోటును లెక్కలోకి తీసుకోలేదు. కాబట్టి, కేంద్రం విభేదిస్తున్న బిల్లులు, వేతన సవరణ కమిషన్ బకాయిలు స్పష్టంగా 2014-15లో వనరుల లోటుకు దారితీస్తాయి. ఈ విభేదిస్తున్న వ్యయ బిల్లులు నాలుగు ప్రమాణాలకు తగ్గట్టుగా ఉన్నాయో జాగ్రత్తగా పరిశీలించటం అవసరం:

1. వ్యయం అవసరమైనదా, అంచనాల పరిధిలోనిదా, ప్రామాణికత కోవలోనిదా, లేక ప్రత్యేకమైనదా, కొత్తదా, అప్రామాణికమైనదా?
2. విభేదిస్తున్న/తిరస్కరిస్తున్న కోశాగార (ట్రెజరీ) బిల్లులు రాష్ట్ర ప్రభుత్వ వ్యయమా, లేక అందులో స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వ పాక్షిక సంస్థల (పారాస్టాటల్స్) వ్యయం కూడా ఉందా?
3. ఆ వ్యయం 2014-15 ఆర్థిక సంవత్సరం హామీలు, చెల్లింపులకు సంబంధించినదా?
4. ఆ వ్యయం తర్వాత కలిపినదా?

**5. పి.ఆర్.సి బకాయిలు**

ప్రభుత్వోద్యోగుల జీతాల్ని పునస్సమీక్షించటానికి పదవ వేతన సవరణ సంఘం (పి.ఆర్.సి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013, ఫిబ్రవరి 28న ఏర్పాటైంది. రాష్ట్ర విభజనకు నాలుగు రోజుల ముందు 2014, మే 29న కమిషన్ తన నివేదికను సమర్పించింది. పి.ఆర్.సి 29 శాతం ఫిట్‌మెంట్‌ను సూచించగా, మార్చి 18, 2015న తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ప్రయోజనం అమలుకు

ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 43 శాతం ఫిట్‌మెంట్ ప్రయోజనాన్ని ఆమోదించి అమలుకు 30-04-2015న ఉత్తర్వును ఇచ్చింది (ఎనెగ్జర్-11). ఈ వేతన సవరణ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేసిన వేతన సవరణల తరహాలో ఉంది. అప్పుడు కూడా, ప్రభుత్వం పి.ఆర్.సి సిఫారసు చేసిన దానికంటే ఎక్కువ ఫిట్‌మెంట్ ప్రయోజనాన్నే ఉద్యోగులకు ప్రకటించింది. టేబుల్ 1.7 లో చూడొచ్చు.

ఈ వ్యయం భారతదేశంలో కేంద్రంలో, అన్ని రాష్ట్రాల్లో ఉండే ప్రభుత్వాలు సాధారణ విధుల్లో భాగంగా చేసేదే. ఉద్యోగులు జూన్ 2, 2014 వరకు ఒకే ప్రభుత్వం కింద పనిచేశారు కాబట్టి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలూ జీతాల్ని ఒకేలా పెంచటం అనివార్యం, అవసరం కూడా. రాష్ట్ర విభజన జరిగిన వెంటనే, తెలంగాణతో పోలిస్తే తక్కువ వేతన పెంపును ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తే, ప్రభుత్వోద్యోగులు పెద్దఎత్తున ఆందోళనకు దిగేవారు, పాలన స్తంభించి ఉండేది. కాబట్టి, 2014-15 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులకు చెల్లించాల్సిన పాత బాకీల్ని వాస్తవిక ఖర్చుగా, ఆంధ్రప్రదేశ్ ఖజానాకు ప్రామాణిక వ్యయంగానే గుర్తించాలి. చట్టప్రకారం చెల్లించాల్సిన బకాయిల్ని ఆర్జనావకాశాల సమస్యలు, నిధుల కొరత వల్ల.. ఆ ఆర్థిక సంవత్సరంలో చెల్లించకుండా తర్వాతికాలానికి వాయిదావేశారు. ఆ తర్వాత ఉద్యోగులకు బకాయిల్ని చెల్లించారు (ఎనెగ్జర్-12). కాబట్టి, ఈ మొత్తం రూ.3,920 కోట్లను 2014-15 సంవత్సరానికి నిజమైన వనరుల లోటుగానే పరిగణించాలి, కేంద్ర ప్రభుత్వం నుంచి పరిహారానికి ఇది పూర్తిగా అర్హమైనది.

**6. విభేదిస్తున్న బిల్లులు**

రాష్ట్ర విభజన తర్వాత ఆదాయం ఒక్కసారిగా పడిపోవటంతో పరిశేష ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెల్లింపులను చేయలేకపోయింది. మూలధన (క్యాపిటల్) ఎకౌంట్ పెండింగ్ బిల్లులను అలా వుంచితే, రూ.2,950.20 కోట్ల దాకా పెండింగ్ బిల్లులు పేరుకుపోయాయి. నిధుల కొరత, ఆదాయ వనరుల సమస్య వల్ల మూడు ట్రెజరీ విభాగాలు, వాటి దిగువ ఏజెన్సీలు, రాష్ట్రం బిల్లులకు చెల్లింపులు చేయలేకపోయాయి. ఈ వివరాల్ని టేబుల్-1.9లో పొందుపరిచాం.

విభేదించిన బిల్లుల్లోని వ్యయమంతా అవసరమైనది, అంచనాల పరిధిలోనిది, ప్రామాణికమైనది. ఈ బిల్లులన్నీ 2014-15 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా చేయాల్సిన నిర్దిష్ట హామీలకు అమలు వ్యయానికి సంబంధించినవేనని, ఇందులో స్థానిక ప్రభుత్వాలు లేదా పబ్లిక్ అకౌంట్స్‌లోని పాక్షిక ప్రభుత్వ సంస్థలకు సంబంధించినవి కావని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ధృవీకరించింది. ఈ వ్యయాన్ని ఆ తర్వాత 2016-17 వ్యయంలో కలిపారు. ఆదాయావకాశాల పరిస్థితి మెరుగుపడటంతో ఆ బిల్లులను కోశాగారం (ట్రెజరీ) పాస్ చేసింది.

ఇవన్నీ కూడా 2014-15 చట్టబద్ధ రెవెన్యూ వ్యయంలో భాగమేకానీ, నిధుల కొరతతో వాటి చెల్లింపుల్ని తర్వాతి సంవత్సరానికి బదిలీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన వివరాల్ని తనిఖీ చేసేందుకు ఒక అకౌంట్స్ కమిటీని అధికారికంగా ఏర్పాటు చేయవచ్చు. అటువంటి తనిఖీ పరిధిలోనే అయినా, ఈ మొత్తాలన్నీ కూడా 2014-15లోని చట్టబద్ధ వనరుల లోటులో భాగం. ఇచ్చిన హామీ ప్రకారం కేంద్రం ఈ వ్యయాల్ని భర్తీ చేయాలి.

1.8 పట్టికలో స్పష్టమవుతున్నట్లు, ఈ రెండు విభేదించిన వ్యయాలూ- పిఆర్‌సి బకాయిలు, రెవెన్యూ అకౌంట్ ప్రాతిపదికన విభేదించిన బిల్లులు కూడా ప్రమాణీకరించిన నిబంధనలకనుగుణంగా అవసరమైనవి, అంచనాల పరిధిలోనివి. అవి రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలోకి వస్తాయి తప్ప, స్థానిక ప్రభుత్వాలు లేదా పాక్షిక ప్రభుత్వ సంస్థల ఖాతాల్లోకి రావు. అవి 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవి, 2014-15లోనే చెల్లించాల్సినవి. వనరుల కొరత వల్ల, ఆ వ్యయాన్ని తరువాతి కాలానికి పొడిగించారు. దీనివల్ల భర్తీ కాని రెవెన్యూ లోటు తదుపరి సంవత్సరాలలో పెరిగిపోయింది.

ఈ వాస్తవాలు, పరిస్థితుల నేపథ్యంలో.. ఈ రెండు అంశాలకు సంబంధించిన రూ.6,870 కోట్ల మొత్తాన్ని 2014-15 వనరుల లోటులో చేర్చటం సమంజసం, హేతుబద్ధం.

**వనరుల లోటుకు సంబంధించి 2014-15 ఆర్థిక సంవత్సరంలో బకాయి పడ్డ మొత్తం**

2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయని మొత్తం 'వనరుల లోటు'ను, ప్రస్తుత పరిస్థితిని టేబుల్-1.10 లో పొందుపరిచాం.

ఎ.పి.ఆర్.ఎ సెక్షన్ 46(2) రీత్యా, పార్లమెంటులో ప్రధానమంత్రి ప్రకటన ప్రకారమూ, 2014–15 ఆర్థిక సంవత్సరంలో వనరుల లోటు భర్తీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు బకాయి పడ్డ మొత్తాల్ని టేబుల్–1.10 వివరిస్తుంది.

**పట్టిక 1.10**

| **2014–15 ఆర్థిక సంవత్సరానికి వనరుల లోటు భర్తీలో భాగంగా బకాయి పడ్డ మొత్తం (రూ. కోట్లలో)** | | | |
|---|---|---|---|
| **వ్యయ కారణం (2014–15లో చేసిన వ్యయం)** | **మొత్తం వ్యయం/లోటు** | **ప్రమాణాలు అంగీకరించే నిబంధనల ప్రకారం వనరుల లోటులో భాగమయ్యే మొత్తం** | **అసాధారణ, అప్రామాణిక వ్యయం – విచక్షణ మీద ఆధారపడి చెల్లింపులు** |
| డిస్కమ్‌లకు ఆర్థిక తోడ్పాటు | 1,500.00 | 1,500.00 | – |
| సామాజిక భద్రతా పింఛన్లు | 3,575.81 | 1,985.07 | 1,590.74 |
| (కేంద్ర ప్రభుత్వ సాధారణ రాయితీ + రాష్ట్ర తప్పనిసరి వాటా) వ్యయసాయ రుణ విముక్తి | 3,068.35 | – | 1,590.74 |
| రైతు సాధికార సంస్థ | 4,001.32 | – | 4,001.32 |
| విభేదించిన వ్యయం – వనరుల సర్దుబాటు సమస్యలతో పిఆర్‌సి బకాయిలు | 3,920.00 | 3,920.00 | |
| విభేదించిన బిల్లులు | 2,950.00 | 2,950.00 | |
| **మొత్తం:** | **19,015.48** | **10,355.07** | **8,660.41** |

**సిఫార్సులు :**

*2014–15 ఆర్థిక సంవత్సరానికి వాస్తవమైన, భర్తీ చేయని వనరుల లోటు రూ.19,015.48 కోట్లు. అప్పటికే చేసిన వ్యయం, ఆదాయవకాశాల పరిస్థితుల కారణంగా విభేదించిన వ్యయం, చెల్లింపులు చేయాల్సిన బాధ్యత ఉన్నా నిధుల కొరత వల్ల చేయలేకపోవటం వంటివన్నీ ఇందులో కలిపి ఉన్నాయి. ఇందులో రూ.10,335.07 కోట్లు స్పష్టంగా పెండింగ్ బిల్లుల తనిఖీ షరతుతోనే అయినా ప్రామాణిక వ్యయం, మార్చి 31, 2015న విభేదించిన చెల్లింపులు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014కి, అందులోని స్ఫూర్తికి అనుగుణంగాను, ఆ చట్టం ఆమోదానికి ముందు పార్లమెంటులో ప్రధానమంత్రి చేసిన నిబద్ధ హామీ ప్రకటన ప్రకారమూ చూస్తే, ఈ మొత్తాన్ని కేంద్రం భర్తీ చేయాల్సుంది.*

*మిగిలిన రూ.8,660.41 కోట్లు నిఖార్సయిన రెవెన్యూ లోటేగానీ, కొత్త పథకాలు, ప్రమాణీకరించని వ్యయం కింద పరిగణించవచ్చు. కొత్త పథకాల కింద ఈ మొత్తాన్ని కేంద్రం విధిగా చెల్లించనక్కర్లేదుగానీ, మిగిలిన ఈ అప్రామాణికమైన మొత్తాన్ని కూడా రీఇంబర్స్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను పరిస్థితుల సమగ్ర నేపథ్యంలో విచక్షణాధికారంతో పరిగణలోకి తీసుకోవచ్చు.*

# వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధి సాయం

**భారత ప్రభుత్వ నిబద్ధ హామీ:**
**ఎ.పి.ఆర్.ఎ లోని సెక్షన్ 46(3)**

*46(3) – "కేంద్రప్రభుత్వం పరిశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని రూపొందించే సమయంలో, తగినన్ని ప్రోత్సాహకాలను, ముఖ్యంగా రాష్ట్రంలోని రాయలసీమ, ఉత్తర కోస్తా ప్రాంతాలకు అందిస్తుంది.*

*94(3) – "నూతన ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజధాని నిర్మాణానికి రాజ్‌భవన్, హైకోర్టు, ప్రభుత్వ సచివాలయం, శాసనసభ, శాసన మండలి, ఇతర అవసరమైన మౌలిక వసతులు వంటి విధిగా కావలసిన సౌకర్యాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది."*

**ఫిబ్రవరి 20, 2014న ప్రధానమంత్రి ప్రకటన**

"మూడోది, ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాల, ముఖ్యంగా రాయలసీమ, ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ జిల్లాలకు బిల్లులో ఇప్పటికే ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఉంది. ఈ అభివృద్ధి ప్యాకేజీ ఒడిషాలోని కె-బి-కె (కొరాపుట్-బలంగిర్-కలహండి) స్పెషల్ ప్యాకేజీ, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలోని బుందేల్‌ఖండ్ స్పెషల్ ప్యాకేజీ తరహాలో ఉంటుంది."

**వెనుకబడిన ప్రాంతాలను అందుకోవటం**
**స్థూల పరిశీలన**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడు భిన్నమైన ప్రాంతాలున్నాయి. ఉత్తర కోస్తా (ఎన్‌సి), దక్షిణ కోస్తా (ఎస్‌సి), రాయలసీమ (ఆర్‌ఎస్). ఈ మూడు ప్రాంతాలు వ్యవసాయ-వాతావరణ పరిస్థితుల్లో విభిన్నంగా ఉంటాయి, వీటి ఆర్థికవృద్ధిలో కూడా తేడాలున్నాయి. 7 జిల్లాలు కలిగిన ఉత్తర కోస్తా, రాయలసీమ రెండు ప్రాంతాలూ ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాలు (బిఆర్)గా పరిగణిస్తారు. విభజనకు ముందు సమయంలో వెనుకబడిన ప్రాంతాల తలసరి జిఎస్‌డిపి (పిసిజిఎస్‌డిపి-బిఆర్) దక్షిణ కోస్తా ప్రాంతం కంటే 15 శాతం, ఆంధ్రప్రదేశ్ సరాసరి కంటే 8 శాతం తక్కువగా ఉంది.

ఈ అగాధం కొనసాగుతూ కాలక్రమేణా ఇంకా విస్తృతమవుతూ వచ్చింది. 2017-18 నాటికి వెనుకబడిన ప్రాంతాల తలసరి జిడిపి దక్షిణ కోస్తా ప్రాంతం కంటే దాదాపు 20 శాతం, ఆంధ్రప్రదేశ్ సరాసరి కంటే 10 శాతం తక్కువగా ఉంది (చిత్రం -2).

వెనుకబడిన ప్రాంతంల్లోని ఏడు వెనుకబడిన జిల్లాల్లో వృద్ధికి ఏరకంగా ఊపునిచ్చి పదేళ్లలో రాష్ట్ర సరాసరి పిసిజిఎస్‌డిపితో సమానంగా తేవచ్చో, 'విభజన వల్ల ఆర్థికపరంగా నష్టంపై అంచనా' అధ్యాయంలో మదింపు చేసినట్లు పరిశీలన చేయటం ద్వారా.. ఈ ప్రాంతాలలో అందించాల్సిన సాయం స్థాయిపై ఒక కోణంలో అంచనాకు రావచ్చు. ఆంధ్రప్రదేశ్ తన బాలారిష్టాలను, అననుకూలతలను (మూలధన నిల్వల పరంగా) అధిగమించి తెలంగాణ రాష్ట్రంతో సమానస్థాయికి చేరుకుంటుందనుకుంటే, పదేళ్ల తర్వాత, అంటే 2027-28 నాటికి ఆంధ్రప్రదేశ్ పిసిజిఎస్‌డిపి రూ.4.4 లక్షలు (2017-18 ధరలకనుగుణంగా) అవుతుంది. ఈ ప్రాతిపదిక మీద ఆధారపడి, రాబోయే 10 ఏళ్లలో రాష్ట్ర సరాసరి పిసిజిఎస్‌డిపితో సమానంగా రావడానికి వెనుకబడిన ప్రాంతాల్లో ఎంతస్థాయి పెట్టుబడులు రావాలో ఒక అంచనాకొతేవటానికి ఈ నివేదిక ప్రయత్నం చేసింది. ఈ గణింపుల్లో చేసిన ప్రతిపాదనలూ, 'విభజన వల్ల ఆర్థికపరంగా నష్టంపై అంచనా' అధ్యాయంలోనివీ ఒకటే.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తలసరి జిఎస్‌డిపి (సెక్షన్ 2లో అంచనా వేసినట్లు) 2027-28 నాటికి రూ.4.4 లక్షలు (2017-18 ధరల ప్రకారం) అవుతుంది. 2017-18లో పిసిజిఎస్‌డిపి రూ.1.4 లక్షలుగా ఉంది. పదేళ్లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంచనా వేసిన అంకెల్ని అందుకోవటానికి వెనుకబడిన ప్రాంతాల జిఎస్‌డిపి ఏటా 11.8 శాతం చొప్పున పెరగాల్సి ఉంటుంది. ఇంతకుముందును ఆంధ్రప్రదేశ్ స్థాయిని అందుకోవటానికి జనాభా పెరుగుదల రేటు ఏడాదికి 0.62 శాతం అవసరం. సగటున ఏడాదికి 12.45 శాతం జిఎస్‌డిపి పెరుగుదల అవసరం.


సగటు వృద్ధికి మొత్తం అన్ని రకాల ఉత్పాదకతల (టిఎఫ్‌పి – టోటల్ ఫ్యాక్టర్ ప్రొడక్టవిటీ) తోడ్పాటు 'విభజన వల్ల ఆర్థికపరంగా నష్టంపై అంచనా' అధ్యాయంలో ఉన్న రీతిలోనే అనుకుంటే, వెనుకబడిన ప్రాంతాల్లోని మూలధన నిల్వల

(క్యాపిటల్ స్టాక్) వృద్ధి రేటు ఏడాదికి 11.75 శాతంగా ఉంది. క్యాపిటల్ స్టాక్ బేస్ సంవత్సరానికి క్యాపిటల్ ఔట్‌పుట్ నిష్పత్తి (సిఓఆర్)ని 3.5గా గణించి అంచనా వేయటమైంది. క్యాపిటల్ స్టాక్‌లో అవసరమైన వృద్ధి రేటు, ఏడాదికి 11.75 శాతాన్ని బేస్ ఇయర్ క్యాపిటల్ స్టాక్‌కు అన్వయించి రానున్న పదేళ్లలో క్యాపిటల్ స్టాక్‌లో చోటు చేసుకోనున్న పరిణామాల క్రమాన్ని ఉత్పత్తి చేసి చూడవచ్చు.

పదేళ్ల కాలంలో మొత్తం రూ.26 లక్షల కోట్ల మూలధనం అవసరం. అందులో రూ.22 లక్షల కోట్లు అంతర్గత పొదుపు ద్వారా పెంపొందుతాయి. మిగిలిన రూ.3.94 కోట్లను ఇతర మార్గాల ద్వారా సేకరించాలి. అంటే, ఆంధ్రప్రదేశ్‌కు బయటి నుంచి అవసరమైన పెట్టుబడుల్లో 85 శాతం కేవలం వెనుకబడిన ప్రాంతాలకే మళ్లాలి. దీనికి కారణం, వెనుకబడిన ప్రాంతాల తలసరి జిఎస్‌డిపి దిగువస్థాయిన ఉండటమే. తక్కువ ఆదాయాల వల్ల, అంతర్గత పొదుపు కూడా తక్కువగానే ఉంటుంది. దీంతో, ఇక పెట్టుబడుల మొత్తం పెరగాలి. డిమాండ్ పెంచటానికి 50 శాతం దాకా ప్రభుత్వం పెట్టుబడుల్ని పెట్టినా, వెనుకబడిన ప్రాంతాలకు అంత పెట్టుబడులు రావాలనుకోవటం అత్యాశే అవుతుంది.

వెనుకబడిన ప్రాంతాల్లో బయటి పెట్టుబడుల స్థాయిని కొంత కుదించటానికి, ఈ ప్రాంతాల పిసిజిఎస్‌డిపిని ఆంధ్రప్రదేశ్ సరాసరి పిసిజిఎస్‌డిపితో సమానం చేయటమనే ఊహాత్మక ప్రతిపాదనను సడలించటం జరిగింది. వెనుకబడిన ప్రాంతాల పిసిజిడిపి, రాష్ట్ర సరాసరి మధ్య నిష్పత్తి ప్రస్తుత 90 శాతం స్థాయిలోనే కొనసాగించటమనే అంచనాతో దీన్ని చేయటం జరిగింది. ఈ మార్చిన ప్రతిపాదనతో వెనుకబడిన ప్రాంతాలకు అవసరమైన సగటు జిఎస్‌డిపి వృద్ధి ఏడాదికి 11.3 శాతంగా (పైన పేర్కొన్న నేపథ్యంలో ఉన్న 12.45 శాతానికి భిన్నంగా) ఉంటుంది.

ఇప్పుడు, పదేళ్ల కాలానికి అవసరమైన మొత్తం పెట్టుబడి రూ.22.1 లక్ష కోట్లు (మొత్తం రాష్ట్రానికి




రూ.51 లక్షల కోట్లు అంచనా కాగా). పదేళ్ల వ్యవధిలో వెనుకబడిన ప్రాంతాల అంతర్గత పొదుపు మొత్తం రూ.20 లక్షల కోట్లు (రాష్ట్రవ్యాప్తంగా ఇది రూ.46 లక్షల కోట్లు) అవుతాయి. మిగిలిన భాగంలో పెట్టుబడులు, రూ.1.52 లక్షల కోట్లు బయటి నుంచి రావాల్సిందే (మొత్తం రాష్ట్రానికి రావాల్సింది రూ.4.7 లక్షల కోట్లు).

మొదటి ఐదేళ్లకు పెట్టుబడి అవసరాలు రూ.72,300 కోట్లు. ఇందులో బయటి నుంచి ప్రైవేటు పెట్టుబడులు రమారమి రూ.36,100 కోట్లు. మిగిలిన రూ.36,100 కోట్లు ప్రభుత్వం నుంచి.

మొత్తంగా చెప్పాలంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వచ్చే ఐదేళ్లలో మొత్తంగా రూ.1.03 లక్షల కోట్ల భర్తీని లక్ష్యంగా చేసుకుంది. దీంతోపాటు అంతర్గత సేవింగ్స్, బయటి నుంచి వచ్చే ప్రైవేటు పెట్టుబడులు రాష్ట్రాన్ని.. ఆశిస్తున్న అభివృద్ధి పథంలో నిలుపుతాయి. ప్రాంతీయ అసమానతల్ని తొలగించాలని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకుంటే, ఇందులో 85 శాతాన్ని వెనుకబడిన ప్రాంతాల్లోనే పెట్టుబడిగా పెట్టాలి. కానీ, వెనుకబడిన ప్రాంతాల పిసిజిఎస్‌డిపి, రాష్ట్ర సరాసరి నిష్పత్తిని మొత్తంగా 90 శాతంగా కొనసాగిస్తే, మొత్తం పెట్టుబడుల్లో మూడో వంతును వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టాల్సి ఉంటుంది.

సిఓఆర్, టిఎఫ్‌పి.. వృద్ధి రేటుకు సంబంధించిన

గణాంకాలకనుగుణంగా అంచనాలు మారుతుంటాయన్నది గమనార్హం. పెట్టుబడుల అంచనాలు 2017-18 ధరలకనుగుణంగా చేయటమైంది, ద్రవ్యోల్బణానికనుగుణంగా సర్దుబాట్లు అవసరమవుతాయి. జిల్లా వారీ తలసరి జిఎస్‌డిపి అంతరాన్ని ఉపయోగించి ఈ అంచనాల్ని ఏడు జిల్లాలకు విభజించవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల సామాజిక-ఆర్థిక సూచికలు (ఇండికేటర్లు) ఆ ప్రాంతాల వెనుకబాటుతనానికి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయి. ఆంధ్రప్రదేశ్ వెనుకబాటుతనానికి అసలైన కారణం ప్రధానంగా ఈ ఉప ప్రాంతాలే. ఈ ప్రాంతాల సూచికలు ప్రత్యేక కేటగిరి రాష్ట్రాల ఇండికేటర్లతో సమానంగా లేదా అంతకంటే హీనంగా కూడా ఉన్నాయి. తక్కువ అక్షరాస్యతా స్థాయి, అక్షరాస్యతలో చాలా ఎక్కువ లింగవివక్ష, అధ్వాన్న నీటి సరఫరా, పేదరికం, వెనుకబాటుతనాలకు సంబంధించి ఈ జిల్లాల్లోని ఇతర ఇండికేటర్లు ఈ ప్రాంతాలకఅభివృద్ధి అవసరాల మీద ప్రత్యేక దృష్టి అవసరమని తేల్చి చెబుతున్నాయి.

ఎ.పిలోని ఈ ఉపప్రాంతాలకు, ప్రత్యేక తరగతి హోదా పొందుతున్న పెద్ద రాష్ట్రాలైన అస్సాం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ, కాశ్మీర్ మధ్య పోలికను టేబుల్ -5.3 తేటతెల్లం చేస్తోంది.

**ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ: బుందేల్‌ఖండ్ తరహాలో**

బుందేల్‌ఖండ్ అభివృద్ధి ప్యాకేజీకి సంబంధించి, కేంద్ర ప్రభుత్వం 2009-12 వరకు మూడేళ్ల కాలానికి ఆ ప్రాంతానికి రూ. 7,266 కోట్లు కేటాయించింది. ఆ తర్వాత, 2012-17 వరకు, వెనుకబడిన ప్రాంతాల గ్రాంట్ నిధి కింద అదనంగా రూ. 4,400 కోట్లను బుందేల్‌ఖండ్‌కు మంజూరు చేసింది. ఆ రకంగా, మొత్తం రూ. 11,666 కోట్లను బుందేల్‌ఖండ్ ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేకగ్రాంట్ కింద ఇచ్చింది. అంటే, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 1.83 కోట్ల జనాభాతో 13

**పట్టిక 5.5**

**బుందేల్‌ఖండ్ ప్యాకేజీ తరహాలో ఆంధ్రప్రదేశ్‌కు వెనుకబడిన ప్రాంతాల నిధి గణింపు**

| అంశం | మొత్తం | బడ్జెట్ గుణకంతో సర్దుబాటు | ద్రవోల్బణ గుణకంతో సర్దుబాటు |
|---|---|---|---|
| | (రూ. లలో) | (రూ. లలో) | (రూ. లలో) |
| బుందేల్‌ఖండ్ | 7,466 కోట్లు | 17,844 కోట్లు | 12,170 కోట్లు |
| ప్యాకేజీ (2009-12) | | (7,466 × 2.39) | (7,466 × 1.63) |
| బుందేల్‌ఖండ్ ప్రాంతానికి | 4,400 కోట్లు | 7,612 కోట్లు | 6,204 కోట్లు |
| మొత్తం గ్రాంట్‌లు | | (4,400 × 1.73) | (4,400 × 1.41) |
| బుందేల్‌ఖండ్‌కు | 6,484 | 13,910 | 10,040 |
| తలసరి మొత్తం (బుందేల్‌ఖండ్ జనాభా = 1.83 కోట్లు) | | | |
| ఆంధ్రప్రదేశ్‌కు గ్రాంట్ | 16,340 కోట్లు | 35,054 కోట్లు | 25,302 కోట్లు |
| చేయాల్సిన మొత్తం | (6,484 × 2.52) | (13,910 × 2.52) | (10,040 × 2.52) |
| (రాయలసీమ + ఉత్తర కోస్తాంధ్ర +ప్రకాశంలోని మార్కాపురం డివిజన్ జనాభా = 2.52 కోట్లు) | | | |

**వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద రాష్ట్రానికి రూ.1,050 కోట్లు మంజూరు చేయగా, రాష్ట్రం రూ.1,641.50 కోట్ల అంచనావ్యయంతో 25,007 పనులను అక్కడ మంజూరు చేసింది. వీటిలో 14,512 పనులు పూర్తయ్యాయి, 5,364 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,049.34 కోట్లకు కన్సాలిడేటెడ్ (సంచిత) వినియోగ ధృవపత్రాల (యు.సిల)ను ఇప్పటిదాకా సమర్పించింది. రాష్ట్రానికి రూ.666 కోట్ల తదుపరి నిధులను 2017-18, 2018-19 సంవత్సరాలకు విడుదల చేయాలని నీతి ఆయోగ్ నవంబర్ 8, 2018న ఆర్థిక మంత్రిత్వ శాఖకు సూచించింది.**

జిల్లాల మేర ఉన్న బుందేల్‌ఖండ్‌కు తలసరి రూ.6,374 ఇచ్చినట్లు. ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాల్లో మొత్తం జనాభా 2.52 కోట్లు. 2009 ధరల ప్రకారం బుందేల్‌ఖండ్ ప్యాకేజీ తరహాలో ఉత్తర కోస్తాంధ్ర, రాయలసీమ (రాయలసీమలో భాగంగా భావించదగిన ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్ కూడా కలిపి) వెనుకబడిన జిల్లాలకు తలసరి కేటాయింపు చేస్తే, జనాభా, బడ్జెట్ గుణకాని (మల్టిప్లయర్)కి అనుగుణంగా (టేబుల్-5.5) ధరల్ని లెక్కేస్తే రూ.35,000 కోట్ల దాకా ఉంటుంది. జనాభా, 5 శాతం ద్రవ్యోల్బణం ప్రకారం లెక్కేస్తే, బుందేల్‌ఖండ్ ప్యాకేజీకనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలకు గ్రాంట్ రూ.25,000 కోట్లు అవుతుంది. స్థూల బడ్జెట్ పెంపుదలకు లేదా మధ్య వ్యవధి కాలంలోని ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేస్తే, ఈ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది.

అక్టోబర్ 16, 2014న రాసిన లేఖలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు, ముఖ్యంగా రాయలసీమ, ఉత్తర కోస్తా ప్రాంతాలకు ఐదేళ్ల కాలానికి (2014-15 నుంచి 2018-19) వరకు రూ.24,350 కోట్ల ప్రత్యేక అభివృద్ధి సాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరింది. ద్రవ్యోల్బణం, జనాభాపరంగా సర్దుబాటు చేస్తే, రాష్ట్రం అడిగిన సాయం దాదాపుగా బుందేల్‌ఖండ్ ప్యాకేజీతో సమానంగా ఉంది.

డిసెంబర్ 02, 2014న అప్పటి ప్రణాళికా సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అప్పటికే కొనసాగుతున్న కేంద్ర ప్రాయోజిత స్కీములతో కలిసిపోయే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ప్యాకేజీ కింద అదనపు నిధుల్ని ఇచ్చే అంశాన్ని పరిశీలించటానికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని నిశితంగా అధ్యయనం చేయాల్సి ఆ సమావేశంలో ప్రణాళికా సంఘం రాష్ట్రానికి చెప్పింది. దీంతో, ఆ తర్వాత, జనవరి 16, 2015న రాష్ట్ర ప్రభుత్వం పునస్సమీక్షించిన మరో లేఖను పంపింది. ఇందులో తన రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి సాయం ఇవ్వటానికి రంగాలవారీగా అవసరమైన కేటాయింపుల్ని కోరుతూ ప్రాథమిక అంచనాల్ని పంపింది. తర్వాత ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ప్రతిపాదనను కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల పరిశీలనకు పంపారు. రంగాలు, కార్యక్రమాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల్ని టేబుల్ 5.6లో చూడవచ్చు. అయితే, 2014-15 నుంచి 2016-17 వరకు మూడు బడ్జెట్ సంవత్సరాలలో కేవలం రూ.1,050 కోట్లను మాత్రమే వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద అందించారు. అంటే, జిల్లాకు ఏడాదికి రూ.50 కోట్లు మాత్రమే కేటాయించారు.

ప్రణాళికా సంఘంతో సంప్రదింపుల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి సాయం కోసం రూ.24,350 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనకు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బిఆర్‌జిఎఫ్) నుంచి కేంద్ర ప్రభుత్వం ఏడాదికి విడుదల చేస్తున్న రూ.350 కోట్ల గ్రాంట్‌కు భారీ అంతరం ఉంది. బుందేల్‌ఖండ్ ప్యాకేజీ, బిఆర్‌జిఎఫ్ కింద బుందేల్‌ఖండ్‌కు 2009 నుంచి 2017 వరకు రూ.6,374 తలసరి గ్రాంట్‌ను ఇవ్వగా, 2015-16 నుంచి 2017-18 వరకు మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలకు విడుదల చేసిన మొత్తం డబ్బు తలసరి రూ.417 చొప్పున రూ.1,050 కోట్లు.

వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద రాష్ట్రానికి రూ.1,050 కోట్లు మంజూరు చేయగా, రాష్ట్రం రూ.1,641.50 కోట్ల అంచనావ్యయంతో 25,007 పనులను అక్కడ మంజూరు చేసింది. వీటిలో 14,512 పనులు పూర్తయ్యాయి, 5,364 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర

ప్రభుత్వం రూ. 1,049.34 కోట్లకు కన్సాలిడేటెడ్ (సంచిత) వినియోగ ధృవపత్రాల (యు.సి.ల)ను ఇప్పటిదాకా సమర్పించింది. రాష్ట్రానికి రూ. 666 కోట్ల తదుపరి నిధులను 2017–18, 2018–19 సంవత్సరాలకు విడుదల చేయాలని నీతి ఆయోగ్ నవంబర్ 8, 2018న ఆర్థిక మంత్రిత్వ శాఖకు సూచించింది.

ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సాయం ఎపిఆర్ఎ, ప్రధానమంత్రి కమిట్‌మెంట్ కింద తనకున్న చట్టబద్ధ బాధ్యతతో ఏమాత్రం పొంతన లేనట్లుగా ఉంది. ఐదేళ్లలో నిర్ణీత కాలవ్యవధితో రూ. 24,350 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్య చర్యల్ని తీసుకోవాలి.

**వెనుకబడిన ప్రాంతాలకు పన్ను రాయితీలు**

ఎపిఆర్ఎ, 2014 కింద రాయలసీమలోని మూడు జిల్లాలకు, ఉత్తరాంధ్రలోని నాలుగు జిల్లాలకు పరిమిత పన్ను రాయితీల్ని ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాలుగా నోటిఫై చేసిన ఏడు జిల్లాలు– అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం (మ్యాప్–2). రాయితీలు ఆదాయపు పన్ను చట్టం కింద ఉండే పన్ను రాయితీలకు అదనం. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 32(1)(2ఎ), సెక్షన్ 32ఎడి కింద పన్ను రాయితీలను ఏడు వెనుకబడిన జిల్లాల్లో అందుబాటులోకి తెస్తూ కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) ఇచ్చిన నోటిఫికేషన్ సారాంశం ఇది:

1. ఏప్రిల్ 1, 2015 నుంచి మార్చి 31, 2020 వరకు ఈ జిల్లాల్లో స్థాపించే ఏ ఉత్పత్తి యాజమాన్య సంస్థయినా 15 శాతం ఎక్కువ అదనపు డిప్రీసియేషన్ (తరుగుదల రాయితీ)కి అర్హత కలిగి ఉంటుంది.
2. నోటిఫై చేసిన వెనుకబడిన ప్రాంతాలలో కొత్త ప్లాంట్‌లో, యంత్రంలో పెట్టుబడి పెట్టే పరిశ్రమలకు ఆ పెట్టుబడిపై 15 శాతం అదనపు పెట్టుబడి రాయితీని నోటిఫై చేయటం జరుగుతుంది. ఐదేళ్లలో ఎప్పుడైనా ఈ పెట్టుబడులు పెట్టచ్చు. 5వ సంవత్సరంలో పెట్టుబడి పెట్టినా పెట్టుబడి రాయితీ వర్తిస్తుంది.
3. రూ. 25 కోట్లు పైబడిన పెట్టుబడులకు బేషరతుగా అదనపు తరుగుదల, పెట్టుబడి రాయితీలను అందించటం జరుగుతుంది.

ఈ నిబంధనలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అర్హమైనవిగా వెనుకబడిన ప్రాంతాలను గుర్తించిన తర్వాత అమల్లోకి వస్తాయి (కేంద్ర మంత్రిత్వ శాఖ, 8 సెప్టెంబర్, 2016, పిఐబి ప్రకటన). పారిశ్రామిక విధానం, ప్రోత్సాహకాల విభాగం (డిఐపిపి) ప్రతిపాదనలు సహా ఇతర పలు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

**సిఫార్సులు:**

*ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి.. ఎపిఆర్ఎ, ప్రధానమంత్రి కమిట్‌మెంట్‌తో తనకున్న నిబద్ధ బాధ్యతతో దాదాపు పొంతన లేనట్లుగా ఉంది. రూ. 24,350 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని నిర్ణీత కాలవ్యవధి పద్ధతిలో ఐదేళ్లలోగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్య చర్యలను తీసుకోవాలి.* ■




**"నేను నా ప్రాణాలు అర్పించైనా సాధించాలనుకునే లక్ష్యాలు చాలానే ఉన్నాయిగానీ, ప్రాణాలు తీసి అయినా సాధించుకోవాలనుకుంటున్న లక్ష్యం మాత్రం ఒక్కటి కూడా లేదు!"**

**– మహాత్మాగాంధీ**

# సీమ, ఉత్తరాంధ్రల్లో హైకోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేయాలి

ఏపీలో హైకోర్టును ఏర్పాటు చేయటం పట్ల లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలుత స్వాగతించి, తర్వాత విమర్శించటం సరికాదన్నారు. విజయవాడలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ మీద రాజకీయ విమర్శకు రాజ్యాంగ సంస్థలను బలహీనపరచటం తగదన్నారు. ఇలాంటి ధోరణులు రాష్ట్రానికి నష్టం చేస్తాయన్నారు. రాజకీయం ఉన్నదే మంచి పాలన కోసమని, అలాంటిది మంచి పాలనకే రాజకీయం అవరోధంగా మారితే ఇక రాజకీయానికి, పార్టీలకు అర్థం ఉండదన్నారు. వికేంద్రీకరణలో భాగంగా హైకోర్టును ఉత్తరాంధ్రలోనో, రాయలసీమలోనో ఏర్పాటు చేస్తే సముచితంగా ఉండేదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో హైకోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లోక్‌సత్తా నేతలు పూర్ణచంద్రరావు, రవితేజ, తుమ్మల లక్ష్మి, పి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమకు నిధుల్ని హక్కుగా సాధించుకుందాం

కరవుతో సతమతమవుతున్న రాయలసీమకు మరిన్ని నిధుల్ని కేటాయించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణబాబు డిమాండ్ చేశారు. కర్నూలు అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశాన్నుద్దేశించి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు సీమ ఉజ్వల భవిష్యత్తుకు అవరోధంగా మారిందన్నారు. ఇంత జరిగాక కూడా ఇంకా ఓట్లు, సీట్లు గురించి, అందుకోసం ప్రజలను మభ్యపెట్టటం గురించే తప్ప రాష్ట్రానికి నిర్మాణాత్మకంగా మేలు చేద్దామన్న ధోరణి ప్రధాన పార్టీల్లో కన్పించటం లేదన్నారు. విభజన చట్టం, హామీల ప్రకారం రాయలసీమ, ఉత్తరాంధ్రకు పెద్ద ఎత్తున నిధుల్ని హక్కుగా సాధించుకోవటంతోపాటు, వీటిని




సద్వినియోగం చేయటానికి స్థానికంగా పాలనను మెరుగుపరచుకోవాల్సి ఉందన్నారు. ఉత్తరాంధ్ర, సీమల్లో హైకోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు ఆనంద్ ఆచారి, రాజ్యలక్ష్మి, కుమార్, సునీల్, చంటి, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# గుంతకల్‌ను విస్తరించండి

గుంతకల్‌ను జోన్ స్థాయికి విస్తరించాలని, స్టేషన్‌కు చర్చి పక్క నుంచి ప్రత్యేక రోడ్డును నిర్మించటంతోపాటు ఎస్కలేటర్ తదితర మౌలిక వసతుల్ని ఏర్పాటు చేయాలని, తిమ్మనచర్ల, హనుమాన్ జంక్షన్ స్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.రామమోహన్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జీఎంను కలిసినవారిలో లోక్‌సత్తా గుంతకల్ పట్టణాధ్యక్షుడు జి.నాగార్జున, కోశాధికారి ఖలీల్, యువసత్తా అధ్యక్షుడు మధు, గోపాల్, ఖాదర్ బాషా, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



**మౌలిక వసతుల్ని నిత్యావసరాలుగా గుర్తించాలి**

గుంతకల్ పట్టణ ట్రాఫిక్ సమస్యపై కూడా చర్యలకు లోక్‌సత్తా నేతలు డీఎస్పీని కలిసి విజ్ఞప్తి చేశారు. దశాబ్దకాలం నాటి రోడ్లు సరిపోవటం లేదని, స్థానిక పాలన అరకొరగా ఉండటంతో నిర్వహణ అధ్వాన్నంగా ఉందని, మౌలిక వసతుల్ని నిత్యావసర సేవలుగా పరిగణించి అత్యవసర చర్యలు చేపట్టాలన్నారు.

# నిజమయిన ఫెడరల్ వ్యవస్థకి సరయిన అదను

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

**2019**లో అటు లోక్‌సభకి, ఇటు ఎనిమిది రాష్ట్రాల శాసనసభలకి ఎన్నికలు జరగనున్నాయి. మే-జూన్ మాసాల లోగా లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్ , ఒడిషా, జమ్ము-కాశ్మీర్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలలో ఎన్నికలు జరగాలి. ఆపైన అక్టోబరు మాసంలోగా మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల ఎన్నికలు జరుగుతాయి. అవికాక జార్ఖండ్‌లో డిసెంబరు మాసాంతానికి ఎన్నికలు పూర్తవుతాయి.

అధికార క్రీడని కోడిపందాలుగా, 20-20 క్రికెట్ ఆటగా భావించే మనదేశంలో సహజంగానే ఎన్నికలంటే చాలా ఆసక్తి, ఉత్కంఠ ఉంటాయి. మన పత్రికలు, టివి ఛానళ్ళు, మేధావులనబడేవాళ్ళు ఈ ఎన్నికలలో జయాపజయాలని గూర్చి ప్రతిరోజు చర్చలు చేస్తారు. కాని ఎన్నికలలో ఓట్ల కొనుగోలు, తాత్కాలిక తాయిలాలు రానురాను పెరిగిపోగా, పార్టీల మధ్య ఏమాత్రం తేడా లేకుండా పోయింది. కాబట్టి ఎవరు గెలిచినా జరగబోయేది ఒకటే అనే నిర్వేదం మనల్ని ఆవహిస్తోంది. ఓపక్కన అధికారం పొందటం కోసం పెట్టుబడిగా ఓట్ల కొనుగోలు కోసం పోటాపోటీలుగా కోట్ల రూపాయలు ఖర్చు చెయ్యటంతో ఎన్నికలయ్యాక ఏదో ఒక రూపంలో అక్రమార్జన చెయ్యటం ఆనవాయితీ అయింది. ఎన్నికల వల్ల ఎవరు పదవులలో కూర్చుంటారనే నిర్ణయం తప్ప, ఎవరు నెగ్గినా నిజంగా సామాన్యుల బ్రతుకులు బాగుపడతాయనికాని, మన పన్నుల డబ్బుతో మనకి కావలసిన ఉమ్మడి సేవలు, మౌలిక సదుపాయాలు సమర్థంగా, నిజాయితీగా అందుతాయనికాని మనకేమాత్రం నమ్మకం కుదరని పరిస్థితి దాపురించింది.

ఈ పరిస్థితుల వల్ల మనకి అడుగడుగునా ప్రభుత్వ సేవలలోగాని, కాంట్రాక్టులలోగాని, నేరపరిశోధనలోగాని, సహజ వనరుల కేటాయింపులలోగాని, బదిలీలలోగాని అంతులేని అవినీతి అదుపుతప్పి పెరుగుతోంది. అంతటితో ఆగక మన పన్నుల డబ్బులన్నీ ఉద్యోగుల జీతభత్యాలకి, ఉచితాల హామీలకే సరిపోవటం లేదు. దాంతో మన పిల్లల భవిష్యత్తుని కాపాడడానికిగాని, బీదరికం నిర్మూలనకిగాని, సామాన్యుల బిడ్డలకి ఎదిగే అవకాశాలు ఇవ్వటానికిగాని, మౌలిక సదుపాయాలకల్పనకిగాని, గ్రామీణ, వ్యవసాయ రంగాలని సంక్షోభం నుంచి బయటపడేసి ఆదాయాలు పెంచేందుకుగాని వనరులు లేని పరిస్థితి వచ్చింది. పన్నులు కట్టినా లంచం లేకుండా పనులు జరగని వ్యవస్థలో, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్న పాలనలో, ఇంకా పన్నుల భారాన్ని పెంచితే ప్రజలు ప్రతిఘటిస్తారు. మన పిల్లల బ్రతుకుల్ని తాకట్టుపెట్టి ఇంకా అప్పులు చెయ్యాలంటే ఒక పరిమితి దాటి అప్పు పుట్టదు; అయినా అప్పులు పెంచితే వడ్డీల భారం పెరగటం, ధరలు అదుపుతప్పటం ఖాయం.

ఈ పరిస్థితుల్లో మన దేశ భవిష్యత్తు, ఈనాటి యువత భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే ఆలోచన చాలామందిని కలచివేస్తున్నది. 1991లో పి.వి నరసింహారావుగారి ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు చేపట్టటం వల్ల ఈమేరకయినా మనదేశం నిలదొక్కుకుంది; కొంతమేరకు ఆదాయాలు, ఆర్థిక ప్రగతి పెరిగి జాతికి ఆత్మవిశ్వాసం కలిగింది. కాని సంపద, ఉత్పాదకత పెరగాలంటే ప్రభుత్వ సేవలు సకాలంలో, లంచాల బెడద లేకుండా, సమర్థంగా అందాలి; మౌలిక సదుపాయాలు అంతర్జాతీయ ప్రమాణాల మేరకు బాగుపడాలి; మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం సామాన్యులకి ఆర్థిక భారం లేకుండా ప్రజలందరికీ అందాలి; చట్టం అందరినీ సమానంగా చూస్తూ, సామాన్యుల హక్కులని సమర్థంగా కాపాడాలి; సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయరంగానికి విముక్తి కలిగించి, రైతులకి ఆదాయాలు పెరిగే విధానాలని, పద్ధతులని చేపట్టాలి. కాని ఈ అన్ని రంగాలలో గత 25 ఏళ్ళుగా మన ప్రభుత్వాలు చాలా మేరకు విఫలమయినాయి. 2014లో అనూహ్యంగా, మౌలికమయిన మార్పులు వస్తాయన్న విశ్వాసంతో, ఆశతో దేశ ప్రజలు మోదీ ప్రభుత్వానికి పట్టం కట్టారు. కాని అరకొర విధానాలు, వాగాడంబరం తప్ప పైన వివరించిన ఏ రంగంలలోనూ గణనీయమయిన మార్పులు రాలేదు; కనీసం వచ్చే దశాబ్దంలో గణనీయంగా పరిస్థితులు బాగుపడటానికి కావలసిన పునాదులు కూడా వేయలేదు. అందుకే క్రింది పట్టికలో (ఎఫ్.డి.ఆర్ పరిశోధన బృందం అధ్యయనం చేసి రూపొందించినది) చూపినట్లు ఇప్పటికీ 49 పెద్ద దేశాలలో భారతదేశం ప్రతి రంగంలోను అట్టడుగున ఉండి, మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నది.

| కొన్ని కీలక రంగాలలో 49 పెద్ద దేశాల మధ్య భారత, ఇతర దేశాల స్థానాలు | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | భారత్ | చైనా | మలేషియా | వియత్నాం | దక్షిణాఫ్రికా | మెక్సికో |
| తలసరి ఆదాయం (కొనుగోలు శక్తి రీత్యా) GDP Percapita (2017) (PPP - Purchasing Power Parity) | 45 ($7,174) | 36 ($16,624) | 28 ($28,871) | 46 ($6,876) | 39 ($13,403) | 34 ($19,480) |
| జీవన కాల ప్రమాణం Life Expectancy (2017) | 48 (68.9 Years) | 30 (76.3 Years) | 36 (75.2 Years) | 31 (76.2 Years) | 50 (57.8 Years) | 28 (77.3 Years) |
| శిశుమరణాల రేటు IMR (2017) [per 1,000 live births] IMR - Infant Mortality Rate | 47 (32) | 31 (08) | 29 (6.7) | 40 (16.7) | 46 (28.8) | 35 (11.5) |
| మాతా మరణాల రేటు MMR (2015) [per 1 lakh live births] MMR - Maternal Mortality Rate | 47 (174) | 33 (27) | 36 (40) | 40 (54) | 46 (138) | 35 (38) |
| ఆరోగ్యం కోసం ప్రజల స్వంత ఖర్చు OOP Expenditure in Healthcare (2014) [% of Total Health Expenditure] | 46 (62.42%) | 32 (31.99%) | 13 (35.30%) | 37 (36.76%) | 3 (6.49%) | 38 (44.00%) |
| పాఠశాలకు వెళ్ళే సగటు కాలం MYS (2017) (Mean years of Schooling) | 45 (6.4 Years) | 42 (7.8 Years) | 27 (10.2 Years) | 38 (8.2 Years) | 28 (10.1 Years) | 36 (8.6 Years) |
| మానవ అభివృద్ధి సూచిక HDI (Human Development Index) (2017) | 45 (0.640) | 37 (0.752) | 30 (0.802) | 44 (0.694) | 41 (0.699) | 33 (0.774) |
| తలసరి విద్యుత్ వినియోగం Power Consumption (2011) (Kwh Per capita) | 44 (684.11) | 33 (3,297.97) | 29 (4,246.47) | 43 (1,073.28) | 28 (4,694.23) | 39 (2,091.69) |
| వ్యవసాయంలో ఉపాధి పొందుతున్న వారి శాతం Percentage of population employed in Agriculture (2017) | 49 (42.74%) | 38 (17.51%) | 34 (11.01%) | 43 (40.87%) | 26 (5.55%) | 35 (13.11%) |
| మహిళలలో కార్మిక భాగస్వామ్య శాతం LFPR (Labour Force Participation Rate) - Women (2017) | 45 (27.21%) | 4 (61.48%) | 27 (50.78%) | 1 (73.24%) | 37 (47.85%) | 40 (44.12%) |

బ్రాకెట్ లో ఉన్న అంకెలు వాస్తవ గణాంకాలు; మూలం: ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్. డి.ఆర్.) పరిశోధన బృందం

ఈ దేశ ప్రజలలో భవిష్యత్తు బాగుపడాలనే తపన ఉంది. మన కుటుంబాలు చాలా బలమైనవి. కులం, మతం నిమిత్తం లేకుండా తల్లిదండ్రులు పిల్లల కోసం ఎన్ని త్యాగాలకయినా సిద్ధమయ్యే సమాజం మనది. చట్టాలు అమలుకాకున్నా ఎంతో సంయమనాన్ని పాటించి శాంతిని, భద్రతని పరిరక్షించే సంస్కృతి మనది. మన పిల్లలు తెలివితేటలలో, క్రమశిక్షణలో ఎవరికీ తీసిపోరు. ప్రతి రంగంలో ప్రపంచ ప్రమాణాల నందుకున్న సమర్థులు, మేధావులు కోకొల్లలుగా మనకున్నారు. ఫలితం వస్తుందన్న నమ్మకం ఏమాత్రం ఉన్నా భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టి, నిరంతరం కష్టపడేవారు దేశమంతటా ఉన్నారు. ప్రభుత్వం మంచి చేస్తుందన్న నమ్మకం ఉంటే కష్టకాలంలో కూడా మద్దతిచ్చే పౌరులు కోట్లాదిమంది ఉన్నారు. మన దేశం ఆర్థికంగా, సామాజికంగా ఎదగటానికి కావలసిన అన్ని లక్షణాలు మనకున్నాయి. లేనిదల్లా మన భవిష్యత్తుని పదిలపరిచే రాజకీయ, పాలనా వ్యవస్థలు.

ఈవేళ కొంత పొదుపు చేసుకుని, రేపటి భవిష్యత్తు కోసం కష్టపడితే, రేపటి కోసం ఈవేళ కొంత సుఖాన్ని త్యాగం చేస్తే వ్యక్తులుగాని, కుటుంబాలుగాని ఎదుగుతాయి. అలాకాక ఈరోజు అవసరాలు, సుఖాలు, సరదాల కోసం రేపటిని తాకట్టు పెడితే, ఆ కుటుంబాలు పతనమవుతాయి. ఒక సమాజానికి, దేశానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.

పరిస్థితి విత్తు ముందా; చెట్టు ముందా అన్న తీరున తయారయింది. ఈవేళ అకస్మాత్తుగా ఏ పార్టీ అయినా ఓట్లు కొనకుండా, తాయిలాలు పంచకుండా పోటీకి దిగితే ఓటమి దాదాపు ఖాయమయిపోయింది. తాము వేసే ఓటుకి, తమ జీవితాలకి మధ్య సంబంధం తెగిపోయింది. కేంద్రీకృత పాలనలో ఎవరు నెగ్గినా తేడా లేకుండా పోయింది. అలాంటి పరిస్థితుల్లో కనీసం ఓటు కోసం పంచే డబ్బు, ఆ తరువాత ఇచ్చే ఉచితాలు, తాయిలాలు కనీసం తాత్కాలిక అవసరాలని తీరుస్తున్నాయి. తమ దీర్ఘకాలిక భవిష్యత్తుకి ప్రభుత్వాల నుంచి భరోసా లేనప్పుడు, రెక్కాడితేగాని డొక్కాడని సామాన్యులు, బ్రతుకుపోరాటంలో అలసిపోతున్నవారు తాత్కాలిక ఆకర్షణలకి లోబడటం ఆశ్చర్యం కాదు. దేశ నాయకత్వం విలువయిన ఏడు దశాబ్దాలని, ఆర్థిక సరళీకరణ తరువాత పాతిక సంవత్సరాలని వృధా చేయటం వల్ల ఈ సంక్షోభం కరడుకట్టి పోయింది. ఇందుకు పార్టీలని తిట్టిపోయటం వ్యర్థం; అవన్నీ ఊబిలో కూరుకుపోయాయి. ఇది నీతివాక్యాలతోనో, కొందరి త్యాగాలతోనో, దైవకృపతోనో పరిష్కారమయ్యే సంక్షోభం కాదు.

ఈ పరిస్థితుల్లో ఇప్పటికయిన మేలుకుని మన బిడ్డల భవిష్యత్తుని కాపాడుకోవాలంటే చేపట్టవలసిన ఆచరణ సాధ్యమయిన చర్యలేమిటి? 2019 సంవత్సరంలో మనందరి

దృష్టి దీని మీద పెట్టాలి; ఎవరు నెగ్గుతారు అన్న ఉత్కంఠకి బదులు ఏం చేస్తే ఈ చిక్కుముడులు విప్పగలం అనే ఆలోచన మన బహిరంగ చర్చలో కీలకమయిన అంశం కావాలి.

దేశమంతా ఏ ఎన్నికలని చూసినా ప్రజలు కేవలం ఆయా రాష్ట్రాలలోని ప్రభుత్వాల మీద, నాయకత్వం మీద మాత్రమే తీర్పునిస్తున్నారు. అందుకే ప్రతి రాష్ట్రంలోను పంచాయితీ, మునిసిపాలిటీ, రాష్ట్ర శాసనసభ, లోక్‌సభ – అన్ని ఎన్నికలలోను ప్రజలు ఒకేతీరున ఓటు వేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వం, లేదా నాయకత్వం నచ్చితే అన్ని ఎన్నికలలో ఆ పార్టీకే విజయం; నచ్చకపోతే అన్ని ఎన్నికలలో ఆ పార్టీకి ఓటమే! అంటే, అత్యధిక ప్రజల ఆశలు, వారి తీర్పు పూర్తిగా రాష్ట్రాల పనితీరుని బట్టే ఉంటున్నాయి.

1950 నుండి 1980ల దశకం దాకా దాదాపు నాలుగు దశాబ్దాల కాలం మనదేశంలో పేరుకు రాష్ట్ర ప్రభుత్వాలున్నా పెత్తనం చాలా మేరకు కేంద్ర ప్రభుత్వానిదే. ఆ తరువాత ఎన్.టి.ఆర్, హెగ్డే, జ్యోతిబసు, బిజూపట్నాయక్, కరుణానిధి లాంటి నాయకులు దీర్ఘకాల పోరాటం చేసి కొంతమేరకు రాష్ట్రాలకి స్వయంపాలనని, అధికారాలని సాధించారు. బొమ్మై కేసులో తీర్పుతో 356వ అధికరణం దుర్వినియోగం తగ్గింది; ప్రజల మద్దతున్నా, సభలో మెజారిటీ ఉన్నా, ఎప్పుడయినా ప్రభుత్వాన్ని తొలగిస్తారేమోననే భయం చాలామేరకు తగ్గింది. ఆర్థిక సంఘాలు పక్షపాతాలకతీతంగా నిబంధనల మేరకు రాష్ట్రాలకి వనరుల పంపిణీకి ఏర్పాట్లు చేయటంతో కేంద్రం విచక్షణాధికారం తగ్గింది. ప్రాంతీయ పార్టీలు బలపడి, రాజకీయ పోటీ పెరిగి, కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు అనివార్యం కావటంతో, రాష్ట్రాల అభిప్రాయాలని, అవసరాలని పట్టించుకోవటం అనివార్యమయింది. 1991లో మొదలయిన ఆర్థిక సరళీకరణతో లైసెన్సు రాజ్యం చాలామేరకు అంతమై ఆర్థిక వికేంద్రీకరణ జరిగింది; రాష్ట్రాలు పెట్టుబడుల కోసం, పరిశ్రమల స్థాపన కోసం చొరవ తీసుకోవటం సాధ్యమయింది. ప్రభుత్వరంగ సంస్థల పాత్ర తగ్గటంతో పరిశ్రమల స్థాపన కోసం కేంద్రాన్ని ప్రాధేయపడే పరిస్థితి పోయింది. వీటన్నిటి వల్ల రాష్ట్రాలు కొంతమేరకు బలపడటమే కాదు; రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమయిన పోటీ పెరిగింది; రాష్ట్రాలు కొంతవరకు నూతన పద్ధతులని ప్రవేశపెడుతున్నాయి; కొన్ని రంగాలలో మంచి ఫలితాలు సాధిస్తున్నాయి; మంచి ఫలితాలని చూసి కొన్ని పద్ధతులని ఇతర రాష్ట్రాలు అనుకరిస్తున్నాయి. ఈ కారణాలుగానే గత 20 – 30 సంవత్సరాలలో చాలా రాష్ట్రాలలో ఆర్థిక ప్రగతి రేటు పెరిగింది.

కాని ఇప్పటికి కూడా ప్రజలిచ్చిన తీర్పుకి అనుగుణంగా పనిచేసి పూర్తి ఫలితాలనందించే స్వేచ్ఛ, స్వయంపాలన రాష్ట్రాలకి లేవు. మరే ఫెడరల్ దేశంలోను లేనిరీతిన మనదేశంలో రాష్ట్రాలన్నింటికి మూసపోసిన ఒకే రకమయిన ఏకాకృత ఎన్నికల వ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థ రాజ్యాంగబద్ధంగా ఉన్నాయి; తమ అవసరాలకి అనుగుణంగా సంస్కరణలు తెచ్చే అవకాశాలు లేవు. అలాగే కేంద్రం నియమించిన గవర్నర్లకి చాలా విచక్షణాధికారాలుండటమేకాదు; కేవలం రాజకీయ కారణాలతో నచ్చని ప్రభుత్వాలని గవర్నర్ల ద్వారా ఇరుకునపెట్టటం ఆనవాయితీ అయింది. చివరికి మరే దేశంలోను లేనట్లుగా స్థానిక ప్రభుత్వాల ఎన్నికల పద్ధతిని కూడా సవివరంగా రాజ్యాంగంలోనే పెట్టి, ఆయా ప్రాంతాల అవసరాలకి అనుగుణంగా ప్రభుత్వం నిర్మాణం చేసే అవకాశం లేకుండా గిరి గీశారు. అఖిల భారత సర్వీసులు అన్న పేరుతో రాష్ట్రాలలో పనిచేసే అధికారుల పగ్గాలన్నీ కేంద్ర ప్రభుత్వం చేతుల్లో పెట్టారు. సమర్థులు తమ రాష్ట్రాలలో ఉన్నా, వారిని కొంతకాలంపాటు ప్రభుత్వంలోకి తీసుకుని మార్పులని సాధించి మంచిపాలననందించే అధికారం రాష్ట్రాలకి లేదు. అడవులు, విద్య, భూసేకరణలాంటి రాష్ట్రాల అంశాలని వివిధ కారణాలు చూపెట్టి ఉమ్మడి జాబితాలో చేర్చి, ఏ చిన్న పని కావాలన్నా కేంద్రం నుంచి అనుమతి అవసరమయ్యే పరిస్థితి తెచ్చారు. ఉదాహరణకి విద్యాహక్కు చట్టం వల్ల విద్యాప్రమాణాలు బాగుపడకపోగా గత దశాబ్దంలో బాగా దిగజారాయి. అయినా కేంద్ర చట్టం రాష్ట్రాలకి శిరోధార్యం! అలాగే భూమి రికార్డులు, నియంత్రణ రాష్ట్రాలకి చెందిన అంశమయినా, పునరావాసం కేంద్రం పరిధిలోనిదన్న వంకతో, నిజమయిన ప్రజాప్రయోజనాలకి భూసేకరణ దాదాపు అసాధ్యమయ్యే పరిస్థితి కల్పించారు. పశువుల పెంపకం రాష్ట్రాలకి చెందిన అంశమయినా, జంతుహింస నివారణ కేంద్రానికి చెందిన అంశం అన్న వంకతో కొంతకాలం క్రితం పశువుల వాణిజ్యం అంతటిని చాలా కఠినంగా, రైతులని దెబ్బతీసేలా, నియంత్రిస్తూ నిబంధనలు జారీ చేశారు; కోర్టుల జోక్యంతో వాటిని నిలుపుచేశారు! అలాగే కేంద్ర ప్రతిపాదిత పథకాలు అన్న పేరుతో దేశమంతా ఒకే మూసలో, పిడుక్కి, బియ్యానికి ఒకే మంత్రంతో రాష్ట్రాల మీద అసంబద్ధ విధానాలు రుద్దుతున్నారు. ఇలా ఎక్కడ చూసినా పెత్తనం, జోక్యం కేంద్రానిది; ప్రజా తీర్పు, బాధ్యతలు, బరువులు రాష్ట్రాలివి!

ప్రస్తుతం దేశంలో పెద్ద రాష్ట్రాలలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాంలలో మాత్రమే ప్రత్యక్షంగా బి.జె.పి – కాంగ్రెస్

పోటీపడుతున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్‌లలో రెండు జాతీయ పార్టీలకి కీలకపాత్ర ఉన్నా, శివసేన, ఎన్.సి.పి, జనతాదళ్ (ఎస్), అకాలీదళ్ లాంటి ప్రాంతీయపార్టీల పాత్ర గణనీయమైనది. జార్ఖండ్‌లో బి.జె.పి బలంగా ఉన్నా, మిగతావన్నీ ప్రాంతీయపార్టీలే. అన్ని ఇతర రాష్ట్రాలలోను ప్రాంతీయ పార్టీల పాత్ర కీలకమయినది. ఈ ప్రాంతీయపార్టీలన్నింటికీ తాము ఆశించినమేరకు ప్రజలకి న్యాయం చేయలేకపోతున్నామని, కేంద్ర అనవసర పెత్తనం, లేదా దేశమంతా ఒకే మూస పోసిన పద్ధతుల వల్ల ఫలితాలు రావటం లేదని, ఆ నిందని తాము మోస్తున్నామని, ప్రజల వ్యతిరేకతని మూటకట్టుకుంటున్నామని తెలుసు. అలాగే జాతీయపార్టీల రాష్ట్ర నాయకులు బయటికి చెప్పుకోవటం సాధ్యంకాకపోయినా, తమ రాష్ట్రాలలో ప్రజల ఆశలు నెరవేర్చి మంచిపాలన ఇచ్చేందుకు కేంద్రం నుంచి లేదా రాజ్యాంగపరంగా అవరోధాలున్నాయని వాపోతున్నారు. 2019 ఎన్నికలలో ఏ సంకీర్ణం కేంద్రంలో అధికారంలోకి వచ్చినా, ప్రాంతీయపార్టీలు పార్లమెంటులో కీలకపాత్ర పోషించటం ఖాయం. కాబట్టి ఫెడరల్ వ్యవస్థని బలపరచటానికి, ఒకే మూసలోని ఏకరూప వ్యవస్థ స్థానంలో స్థానిక అవసరాలని బట్టి పాలనని రూపొందించటానికి, జాతి ఐక్యతని కాపాడుతూనే రాష్ట్రాలకి పాలనాపరంగా వెసులుబాటునివ్వటానికి 2019 ఎన్నికలు ఒక చరిత్రాత్మక అవకాశాన్నిస్తున్నాయి.

మనందరం దేశఐక్యతని, సమగ్రతని మనసారా కోరుకుంటున్నాం. కాబట్టి ఐక్యతని, దేశ ఉమ్మడి ప్రయోజనాలని కాపాడటానికి కావలసిన ఏర్పాట్లని మరింత సమర్థంగా చేసుకుందాం. కాని ఐక్యత అంటే ఏకరూప వ్యవస్థ కాదు; 137 కోట్ల వైవిధ్యభరిత దేశం అంతటిని, ఇన్ని ప్రాంతాలు, భాషలు, కులాలు ఉన్న దేశాన్ని ఒకే మూసలో పొయ్యటం కాదు. ఏ ఫెడరల్ దేశంలోను– కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, అమెరికా లాంటి ఏ దేశంలోను ఒకే మూస పోసిన ఏకరూప రాజకీయ వ్యవస్థగాని, ఒకేరకమయిన పాలనా పద్ధతులు, పథకాలు గాని అమలులో లేవు. బ్రిటన్ చాలా చిన్న దేశమయినా, ఒకే భాష ఉన్నా, అత్యధికులు ఒకే జాతి, మతానికి చెందినవారయినా, ఆ దేశంలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ఎన్నికల వ్యవస్థ, ఒక్కోరీతిన ప్రభుత్వ నిర్వహణ ఉన్నాయి. బ్రిటన్‌లో పార్లమెంటు ఎన్నికలు మన దేశంలో లాగానే ఉంటాయి; నిజానికి మనం బ్రిటన్‌ని అనుకరించాం. కాని అక్కడి వేర్వేరే ప్రాంతాలు– స్కాట్లండ్, వేల్స్, ఉత్తర ఐర్లండులలో స్థానిక శాసనసభల ఎన్నికలు ఆయా ప్రాంతాల ప్రజలు, ప్రతినిధుల నిర్ణయం మేరకు ఒక్కో తీరున ఉంటాయి. అలాగే బ్రిటన్‌లో యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలు దామాషా పద్ధతిన జరుగుతాయి. స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు ఇతర రూపాలలో ఉంటాయి. లండన్ నగర మేయర్‌ని ప్రజలంతా ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. దేశమంతా ఎన్నికలు, ప్రభుత్వ వ్యవస్థ వేర్వేరు పద్ధతులలో ఉన్నా, దేశ ఐక్యతకి ఏమీ భంగం కలగలేదు. చివరికి నియంతృత్వ దేశమయిన చైనాలో కూడా స్థానిక ప్రభుత్వాలకి, రాష్ట్రాలకి మనకంటే ఎక్కువ స్వేచ్ఛ, వెసులుబాటు ఉన్నాయి; అధికార వికేంద్రీకరణ జరిగింది.

2019లో నిజమయిన ఫెడరల్ వ్యవస్థకి అంకురార్పణ జరిగితే, అప్పుడు రాష్ట్రాలు తమకు నచ్చినరీతిన ఎన్నికల వ్యవస్థని, ప్రభుత్వ ఏర్పాటుని నిర్ణయించుకుంటాయి. కొన్ని రాష్ట్రాలు దామాషా పద్ధతిని ఆశ్రయించొచ్చు; మరికొన్ని ప్రత్యక్ష ఎన్నికలలో ప్రభుత్వాధినేతని ఎన్నుకోవచ్చు. అధికారాన్ని మరింత వికేంద్రీకరించవచ్చు; స్థానిక ప్రభుత్వాలని తమ స్థానిక పరిస్థితుల మేరకు ఏర్పాటు చేసుకోవచ్చు. విధానాలని, పథకాలని తమ అవసరాల మేరకు రూపొందించుకోవచ్చు. వేయి పుష్పాలు వికసిస్తే, ఏ పద్ధతులు మంచి ఫలితాలనిస్తాయో, ఆ పద్ధతులని ఇతర రాష్ట్రాలు స్వీకరిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, పార్టీలు తమ అవసరార్థం, ప్రజల మెప్పును పొందటానికి, తమ రాజకీయ మనుగడకి ఉత్తమ ఫలితాలనిచ్చే పాలనని, విధానాలని చేపడతాయి. రాష్ట్రాల భవిష్యత్తు ఆ రాష్ట్ర ప్రజల మీద, అక్కడి నాయకత్వం మీద మాత్రమే ఆధారపడుతుందిగాని, కేంద్రం పెత్తనం వల్ల అనుకున్నది చేయలేకపోతున్నామన్న క్లేశం ఉండదు; వంకలు ఉండవు. రాష్ట్రాలు ప్రజాస్వామ్యాన్ని, ప్రాథమిక హక్కుల్ని, జవాబుదారీతనాన్ని ఉల్లంఘిస్తే నిరోధించేందుకు రాజ్యాంగ సంస్థల్ని మరింత బలోపేతం చేసుకుందాం.

మనదేశంలో చాలా రాష్ట్రాలు ఒక్కొక్కటి ప్రపంచంలో 90 శాతం దేశాల కంటే పెద్దవి. మన ఉమ్మడి ప్రయోజనాల కోసం దేశ ఐక్యత అవసరం. కాని ఐక్యత ఉంటే దేశమంతా ఒకే మూసలో ఉండటం కాదు. ఇప్పటికే మనకున్న అవకాశాలతోను, మన ప్రజల అవసరాలతోను, ఇతర దేశాలతోను పోలిస్తే మనం సాధించిన ఫలితాలు చాలా తక్కువ. సమయం మించిపోకుండా రాజకీయ పార్టీల నాయకులు – ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు – చొరవ తీసుకోవాలి. స్వామికార్యాన్ని, స్వకార్యాన్ని సంధానిస్తే తప్పక దేశం గతిని మార్చగలం; బీదరికాన్ని తొలగించి ప్రతి బిడ్డకి ఎదిగే అవకాశాలని అందించగలం. ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే ఒక తరం తీవ్రంగా నష్టపోతుంది. ■











# మేకింగ్ ఆఫ్ ఐజిఇ రిపోర్ట్

విభజన నేపథ్యంలో మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీరుపై ఎఫ్.డి.ఆర్/లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ చొరవ తీసుకుని కన్వీనర్‌గా స్వతంత్ర నిపుణుల బృందాన్ని (ఐజిఇ) ఏర్పాటు చేశాక... దాదాపు తొమ్మిది నెలలపాటు తెలుగు రాష్ట్రాల్లోనూ, జాతీయ స్థాయిలోనూ సమాచార సేకరణ, సవివర అధ్యయనం, పరిష్కారాలపై లోతైన కసరత్తు, భిన్నాభిప్రాయాల సమన్వయం, అనేకమార్లు నివేదికను సరిదిద్దడాలు జరిగాయి. మేకింగ్ ఆఫ్ ఐజిఇ రిపోర్ట్‌లో కొన్ని సమావేశాల దృశ్యాలివి.

Posting Date 22-01-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on January 16th 2019




Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad